

మండలి బుద్ధప్రసాద్



సురేఖావాణి

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, మే 26 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ప్రభుత్వ విప్ వెంకటరావు, ఏపీ మెడికల్ కౌన్సిల్ ఛైర్మన్ శ్రీహరిరావు, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి, మహారాష్ట్ర మంత్రి ఉదయ్ సామంత్, సినీనటి సురేఖవాణి, కర్ణాటకకు చెందిన మల్లిఖార్జున ముత్యా(అప్పాజీ), హైదరాబాద్‌కు చెందిన గోల్డ్ మెన్ కొండ విజయ్‌కుమార్ ఉన్నారు.



కొండ విజయ్‌కుమార్, మల్లిఖార్జున ముత్యా


సర్వదర్శనానికి 15 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 8 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లోని 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.3.80 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 91,538

తలనీలాలు సమర్పించినవారు: 37,339



కాకాణి అరెస్టుతో వెంకటగిరిలో హడావిడి

తరలివచ్చిన వైసీపీ నేతలు, కార్యకర్తలు ● కోర్టు పరిసరాల్లో 144 సెక్షన్

వెంకటగిరి, మే 26 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అరెస్టుతో సోమవారం వెంకటగిరి పట్టణంలో హడావిడి నెలకొంది. గోవర్ధన్‌రెడ్డిని నెల్లూరు జిల్లా పోలీసులు రిమాండు నిమిత్తం వెంకటగిరి కోర్టులో హాజరుపరిచారు. దీంతో ఉదయం నుంచే ఉమ్మడి నెల్లూరు జిల్లాకు చెందిన వైసీపీ నేతలు, శ్రేణులు పెద్దసంఖ్యలో ఇక్కడికి తరలి వచ్చారు. వైసీపీ శ్రేణుల నుంచీ ప్రతిఘటన, ఆందోళనలు ఎదురవుతాయేమోనని పోలీసులు ముందు జాగ్రత్తగా కోర్టు పరిసరాల్లో 144 సెక్షన్ విధించడంతో పాటు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. దీంతో పట్టణంలో సోమవారం హడావిడి, ఉత్కంఠ వాతావరణం నెలకొంది.

నెల్లూరు జిల్లా పొదలకూరు పోలీసు స్టేషన్‌లో నమోదైన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుకు సంబంధించి ఏ4 నిందితుడిగా వున్న ఆ జిల్లా వైసీపీ నేత, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని పోలీసులు ఆదివారం కర్ణాటకలో అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో ఆయన్ను సోమవారం వెంకటగిరి కోర్టులో హాజరుపరిచారు. వాస్తవానికి ఈ కేసు గూడూరు అడిషినల్ ఫస్ట్‌క్లాస్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టు పరిధికి సంబంధించింది. ఆ కోర్టు మేజిస్ట్రేట్ సెలవులో వుండడంతో వెంకటగిరి మేజిస్ట్రేట్ విష్ణు వర్మ గూడూరు కోర్టుకు ఇన్‌చార్జి మేజిస్ట్రేట్‌గా వ్యవహరిస్తున్నారు. ఆ కారణంగా నెల్లూరు పోలీసులు కాకాణిని నెల్లూరు ప్రభుత్వాస్పత్రిలో వైద్యపరీక్షల అనంతరం వెంకటగిరి కోర్టుకు తీసుకొచ్చారు. ఈ విషయం తెలిసి నెల్లూరు జిల్లా అల్లూరు మండలం నుంచీ పెద్ద సంఖ్యలో వైసీపీ కార్యకర్తలు తరలి వచ్చారు. వైసీపీ శ్రేణులు ఆందోళన చేపడతాయనే అనుమానంతో ఉదయం 6 గంటల నుంచే కోర్టు వద్ద భారీగా పోలీసులు మొహరించారు. కోర్టు పరిసరాల్లో 200 మీటర్ల వరకూ 144 సెక్షన్ విధించారు. ఉదయం 11.20 గంటలకు వైసీపీ ముఖ్య నాయకులు కోర్టు వద్దకు చేరుకోగా 11.30 గంటలకు కాకాణిని పోలీసులు కోర్టుకు తీసుకొచ్చి మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. రిమాండు రిపోర్టు పరిశీలించిన మేజిస్ట్రేట్ విచారణ మొదలుపెట్టి ఇరువైపుల వాదనలు విన్నారు. ప్రాసిక్యూషన్ తరపున గూడూరు కోర్టు ఏపీపీ కేదార్‌నాథ్.. మాజీ మంత్రి తరపున న్యాయవాదులు విజయ్‌కుమార్‌రెడ్డి, రోజా రెడ్డి, ఉమామహేశ్వర్‌రెడ్డి వాదనలు వినిపించారు. లంచ్ బ్రేక్ అనంతరం 3.10 గంటల సమయంలో మేజిస్ట్రేట్ కాకానికి 14 రోజుల పాటు రిమాండు విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.



కోర్టు నుంచి కాకాణి గోవర్దన్ రెడ్డిని బయటకు తీసుకొస్తున్న పోలీసులు



కోర్టు వద్ద నుంచి జనాన్ని పంపిస్తున్న డీఎస్పీ గీతాకుమారి, సీఐ ఏవీ రమణ

విచారణ జరిగింతసేపూ చేతులు కట్టుకునే..

సోమవారం ఉదయం 11.30 నుంచీ మధ్యాహ్నం 3.10 గంటల దాకా మధ్యలో భోజనం విరామం మినహా విచారణ జరిగింతసేపూ కోర్టులో మాజీ మంత్రి కాకాణి చేతులు కట్టుకుని నిలబడే ఉన్నారు. మేజిస్ట్రేట్ రిమాండు విధించాక పక్కనున్న గదిలోకి వెళ్ళి కూర్చున్నారు. రిమాండు ఉత్తర్వులు వచ్చాక కాకాణి తరపు న్యాయవాదులు జైల్లో ఆయనకు ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని కోరుతూ పిటిషన్ వేశారు.

వైసీపీ శ్రేణుల్లో ఉత్కంఠ : కాకాణి గోవర్ధన్‌రెడ్డికి రిమాండు విధిస్తారా లేక బెయిల్ మంజూరవుతుందా అని వైసీపీ శ్రేణులు ఉత్కంఠగా వేచి చూశాయి. పోలీసు ఆంక్షల కారణంగా శ్రేణులు కోర్టుకు దూరంగా వుండిపోగా ముఖ్య నాయకులు తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి, మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీలు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మేరిగ మురళీధర్, నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, సూళ్ళూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తదితరులు కోర్టు హాలులోను, మిగిలి ద్వితీయ శ్రేణి నేతలు కోర్టు ఆవరణలో గడిపారు. వారంతా మేజిస్ట్రేట్ నిర్ణయం కోసం ఆత్రుతగా నిరీక్షించారు. చివరికి రిమాండు విధించడంతో ఉసూరుమంటూ వెనుదిరిగారు. మొత్తానికీ కాకాణిని వెంకటగిరి కోర్టుకు తీసుకురావడంతో పట్టణంలో హడావిడి, ఉత్కంఠ నెలకొంది.

10న ఆర్టీసీ వైద్యశాల ప్రారంభం?

సిద్ధం చేయాలన్న ఆర్టీసీ ఎండీ



వైద్యశాల నిర్మాణంపై ఆరా తీస్తున్న ఎండీ ద్వారక తిరుమలరావు

తిరుపతి(ఆర్టీసీ), మే 26(ఆంధ్రజ్యోతి): అలిపిరి డ్రైవర్స్ క్వార్టర్స్‌లో నిర్మిస్తున్న వైద్యశాలను జూన్ 10వ తేదీన ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ ఎండీ ద్వారక తిరుమలరావు అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం ఆయన రూ.4కోట్లతో నిర్మిస్తున్న డిస్పెన్సరీ, విశ్రాంతి భవనాన్ని పరిశీలించారు. పనులు ఆలస్యంగా జరుగుతుండడంతో కాంట్రాక్టర్‌పై అసంతృప్తి వ్యక్తం చేశారు. వేగవంతం చేయాలని ఆదేశించారు. వచ్చేనెల తొలివారంలో పూర్తవ్వాలన్నారు. భవన నిర్మాణ వివరాలను ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడి తెలుసుకున్నారు. శ్రీవారి పాదాల చెంత నిర్మితమవుతున్న ఈ భవనం ప్రస్తుత, విశ్రాంత ఉద్యోగులకు సౌకర్యంగా ఉండాలన్నారు. సకల సదుపాయాలు కల్పించాలన్నారు. ఆహ్లాదకరంగా ఉండేలా గ్రౌండ్‌ఫ్లోర్‌లో పచ్చదనం పెంచాలన్నారు. ఆస్పత్రికి అవసరమైన మౌలిక సదుపాయాలు కొరత లేకుండా ఏర్పాటు చేయాలన్నారు. చివరి రెండు అంతస్తుల్లో విశ్రాంతి గదులు పూర్తిచేయడానికి మరో నెలన్నర పడుతుందని కాంట్రాక్టర్ తెలియగా ఆలోపే పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఈడీలు అప్పలరాజు, చెంగల్‌రెడ్డి, చంద్రశేఖర్, డీపీటీవో వెంకటరావు, డిప్యూటీ సీటీఎం విశ్వనాథం, డీఈ చెన్నకేశవులు, ఈఈ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి భక్తులకు జూన్ నుంచి టికెట్ రిజర్వేషన్ సౌకర్యం

తిరుపతి(సెంట్రల్), మే 26(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి దర్శనం కోసం ఆగస్టు నెలలో టికెట్లు కొన్న భక్తులకు జూన్‌లో ప్రయాణపు టికెట్‌లు రిజర్వేషన్ చేసుకునే వసతిని రైల్వే శాఖ కల్పించిందని తిరుపతి స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు టీటీడీ, రైల్వేశాఖల ఉన్నతాధికారులు చర్చలు జరిపి నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. దర్శనం టికెట్లు కొని రైలు రిజర్వేషన్ ఖరారు కాని వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. తిరుమలకు వచ్చే భక్తుల కోసం రైల్వేశాఖ ప్రత్యేక రైళ్లను నడుపుతోందన్నారు.



శ్రీసిటీ అధికారులతో థాయ్ బృందం

శ్రీసిటీని సందర్శించిన థాయ్‌లాండ్ కాన్సుల్ జనరల్

శ్రీసిటీ, మే 26 (ఆంధ్రజ్యోతి): చెన్నైలోని థాయ్‌లాండ్ కాన్సుల్ జనరల్ రాచా ఆరిబార్గ్ తన సతీమణి నరఫాన్ ఆరిబార్గ్‌తో కలిసి రెండు రోజుల పర్యటన నిమిత్తం సోమవారం శ్రీసిటీకి విచ్చేశారు. వారికి శ్రీసిటీ ఆపరేషన్స్ ప్రెసిడెంట్ సతీష్ కామత్ సాదర స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రగతి, ప్రత్యేకతలు, అంతర్జాతీయ మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక వాతావరణం, వ్యాపార ప్రయోజనాల గురించి వారికి వివరించారు. భారత్ - థాయ్‌లాండ్ మధ్య వ్యాపార సంబంధాలను పెంపొందించడంలో ఈ పర్యటన కీలకపాత్ర పోషిస్తుందని శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన ప్రకటనలో తెలిపారు. థాయ్ కాన్సుల్ జనరల్ తన పర్యటనలో భాగంగా తొలి రోజు శ్రీసిటీ అధికారులతో చర్చలు, సెజ్ పరిసరాలతో పాటు థాయ్ పరిశ్రమలైన రాక్‌వర్త్, మాండలెజ్ పరిశ్రమలను సందర్శించి ఆయా పరిశ్రమల ప్రతినిధులతో సమావేశమయ్యారు.

రేపు బర్డ్ డైరెక్టర్ బాధ్యతల స్వీకరణ

తిరుపతి, మే 26(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని బాలాజీ వికలాంగుల శస్త్రచికిత్స, పరిశోధన, పునరావాస కేంద్రం (బర్డ్) డైరెక్టర్‌గా డాక్టర్ జగదీష్ బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబు నాయుడు సూచనలతో ఈనెల 2న బర్డ్ డైరెక్టర్‌గా జగదీష్‌ను నియమిస్తూ టీటీడీ ఈవో శ్యామలరావు ప్రొసీడింగ్స్ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో బర్డ్ ఆస్పత్రి పాత భవనంలో ఇదివరకున్న డైరెక్టర్ ఛాంబర్‌ను సిద్ధం చేశారు. ఈనెల 28న బర్డ్‌ను స్థాపించిన దివంగత నేత ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ఆయనకు నివాళులు అర్పించి జగదీష్ బాధ్యతలు తీసుకోనున్నట్లు తెలిసింది.

గంజాయి స్వాధీనం

పోలీసుల అదుపులో ముగ్గురు అంతర్రాష్ట్ర స్మగ్లర్లు

శ్రీకాళహస్తి,మే26(ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా కదలికలపై పక్కా సమాచారంతో పోలీసులు మాటు వేసి ముగ్గురు అంతర్రాష్ట్ర స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్నారు. సోమవారం శ్రీకాళహస్తి పట్టణ శివార్లలోని చెన్నై రహదారిలో గంజాయి రవాణా సాగుతున్నట్లు సమాచారం అందుకున్న శ్రీకాళహస్తి రెండో పట్టణ పోలీసులు మాటు వేసి ముగ్గురుని అదుపులోకి తీసుకుని గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నట్లు సమాచారం.

రైలు ఢీకొని పాడి రైతు మృతి

బాలాయపల్లి, మే 26 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని పాడిరైతు మృతిచెందిన సంఘటన మండలంలోని పిగిలాం గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. పిగిలాం గ్రామానికి చెందిన అమ్మినేని నాగయ్య (59) అనే రైతు గేదెలను వెతికే క్రమంలో ఆదివారం గ్రామ సమీపంలో రైలు పట్టాలు దాటుతుండా ప్రమాదవశాత్తూ రైలు ఢీకొనడంతో మృతిచెందాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా నాగయ్యకు వినికిడిలోపం ఉండడంతో రైలు రావడాన్ని గుర్తించకపోవడంతో ప్రమాదానికి గురై మృతిచెంది ఉంటాడని స్థానికులు భావిస్తున్నారు.

డిగ్రీ రెండో సెమిస్టర్ ఫలితాల విడుదల

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 26 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ ఆర్ట్స్ కాలేజీ, పద్మావతి డిగ్రీ కాలేజీలకు సంబంధించిన డిగ్రీ రెండవ సెమిస్టర్ ఫలితాలు విడుదలయ్యాయి. స్వయం ప్రతిపత్తి గల ఈ రెండు కాలేజీలు సొంతంగానే పరీక్షలు నిర్వహించి, ఫలితాలు వెల్లడించాయి. ఫలితాలను ఆయా కాలేజీల అధికారులు సోమవారం విడుదల చేశారు. ఎస్వీ ఆర్ట్స్ కాలేజీకి సంబంధించిన ఫలితాలు ఎస్‌వీఏసీ.ఎడ్యూ.ఇన్.. వెబ్‌సైట్‌లో చూడవచ్చు. ఎస్వీ ఆర్ట్స్ కాలేజీలో 88.05 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ వేణుగోపాలరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ మల్లికార్జునరావు ప్రకటించారు. పద్మావతి డిగ్రీ కాలేజీలో 92 శాతం మంది విద్యార్థినులు ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ నారాయణమ్మ తెలిపారు.

వ్యవసాయ శాఖ కౌన్సెలింగ్‌లో ఇష్టారాజ్యం

జాబితాలో ముందున్న వారికే రిక్వెస్ట్ బదిలీలు - కొందరు ప్రజాప్రతినిధుల సిఫార్సులే చెల్లుబాటు





కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న వ్యవసాయ శాఖ ఏడీ శ్రీధర్ కౌన్సెలింగ్ హాల్ బయట ఎదురుచూస్తున్న అధికారులు

అనంతపురం అర్బన్, మే 26(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ అధికారులు, ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్‌లో గందరగోళం నెలకొంది. అనంతపురం జేడీ కార్యాలయంలో ఉమ్మడి అనంతపురం, కర్నూలు, కడప, చిత్తూరు జిల్లాలకు సంబంధించి ఏడీలు, ఏఓలు, సీనియర్ అసిస్టెంట్ల బదిలీల కౌన్సెలింగ్ సోమవారం నిర్వహించారు. వ్యవసాయ శాఖ అదనపు సంచాలకుడు (ఏడీ) శ్రీధర్ నేతృత్వంలో ఆయా జిల్లాల జేడీఈ లు ప్రక్రియలో పాల్గొన్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నందాకా సీనియర్ అసిస్టెంట్లు, ఏడీలు, మధ్యాహ్నం నుంచి రాత్రిదాకా ఏఓలకు బదిలీల కౌన్సిలింగ్ నిర్వహించారు. నాలుగు ఉమ్మడి జిల్లాల అధికారులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరు కావడంతో జేడీ కార్యాలయ ఆవరణలో సందడి నెలకొంది. ఒకే చోట ఐదేళ్ల సర్వీస్ పూర్తిచేసిన వారితో పాటు రిక్వెస్ట్ కింద పలువురు ఉద్యోగులు బదిలీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించింది. ఐదేళ్లు పూర్తయిన అధికారులు, ఉద్యోగులను వారు ఇచ్చిన మూడు ఆప్షన్లలో ఒక స్థానాన్ని ఖరారు చేసినట్లు సమాచారం. రిక్వెస్ట్ కింద బదిలీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారిలో కొందరికే బదిలీ జరిగినట్లు తెలుస్తోంది. ఆన్‌లైన్ జాబితాలో ముందున్న కొందరికే రిక్వెస్ట్ బదిలీకి అంగీకరించారు. ఆ తర్వాత జాబితాలోని అధికారులు, ఉద్యోగులను నిర్థాక్షిణ్యంగా కౌన్సెలింగ్‌లో చెప్పుకునేందుకు కూడా అవకాశం ఇవ్వలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు క్యాడర్లలో ఐదేళ్లు పూర్తి కాని స్థానాలకు ఇతర అధికారులను బదిలీ చేసేందుకు అంగీకరించినట్లు తెలిసింది. ఇదే తరహాలో దరఖాస్తు చేసుకున్న మరి కొందరు అధికారుల దరఖాస్తులను పక్కన పెట్టినట్లు సమాచారం. కొందరు ప్రజాప్రతినిధుల సిఫార్సులను ఓకే చేసి.. అక్కడికక్కడే అధికారులకు స్థానాలను ఖరారు చేసి పంపినట్లు సమాచారం. మరికొందరి సిఫార్సులను బుట్టదాఖలు చేశారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముందస్తు మేనేజ్ నేపథ్యంలోనే పలువురు అధికారులను వారు కోరుకున్న స్థానాలకు పంపకుండా ఆపేసినట్లు చర్చ సాగుతోంది. ఏడీలు, ఏఓలు, సీనియర్ అసిస్టెంట్ల బదిలీలు రాష్ట్రస్థాయిలో ఫైనల్ చేస్తారు. ఏడీ నేతృత్వంలోని కమిటీ సిఫార్సులనే దాదాపుగా రాష్ట్ర ఉన్నతాధికారులు ఓకే చేసే పరిస్థితి ఉంది. ఇక్కడ తమకు అన్యాయం జరిగిందని భావించిన అధికారులు, ఉద్యోగులు రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులను కలిసే అవకాశం ఉన్నా.. అక్కడికి వెళ్లేవారు తక్కువేనన్న వాదనలు వినిపిస్తున్నాయి.వ్యవసాయ శాఖ యూనియన్లలో ఆఫీస్ బేరర్లుగా ఉన్న అధికారులకు, ఉద్యోగులకు కూడా చేదు అనుభవం ఎదురైనట్లు తెలిసింది. ఆఫీస్ బేరర్లు.. కలెక్టర్ నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంది. బదిలీల సమయానికి కలెక్టరేట్ నుంచి ప్రొసీడింగ్స్. కమిటీకి అందకపోవడంతో తమకు ఏ స్థానం కేటాయిస్తారోనన్న సందేహాలను ఆ వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి.

దరఖాస్తు చేయకపోయినా..

వ్యవసాయశాఖలో బదిలీకోసం దరఖాస్తు చేయనివారికి సైతం స్థాన చలనం కలుగుతోంది. ఒక స్థానాన్ని అయినవారికి కేటాయించేందుకు అక్కడున్నవారిని కదిలిస్తున్నారు. ఏమాత్రం సమాచారం ఇవ్వకుండా, వారి అంగీకారాన్ని అడగకుండా బదిలీ చేసేస్తున్నారు. ఈ జాబితాలో కేవలం రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారు, చార్జెస్ ఉన్నవారు కూడా ఉండడం గమనార్హం. అయినవారికి ఇవ్వాలనుకుంటే తమకు సమాచారమైనా ఇవ్వాలి కదా..? చెప్పాపెట్టకుండా ఎలా బదిలీ చేస్తారని బాధితులు ప్రశ్నిస్తున్నారు. సిఫార్సులకు ప్రాధాన్యం ఇచ్చేక్రమంలో తమను బలిపశువులను చేస్తున్నారని మండిపడుతున్నారు. ఈ తతంగానికి జేడీ కార్యాలయం వేదికైంది. కౌన్సెలింగ్ ప్రక్రియను సోమవారం రాత్రి తలుపులు వేసుకుని మరీ కానిచ్చేశారు. ఈ అక్రమాల వెనుక ప్రజా ప్రతినిధుల ఒత్తిళ్లు ఉన్నాయా..? లేక ఆ శాఖ ఉన్నతాధికారుల అక్రమాలు ఉన్నాయా అన్న చర్చ జరుగుతోంది.



కౌన్సెలింగ్‌కు హాజరైన వ్యవసాయ అధికారులు, ఉద్యోగులు

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ



శ్రీకాళహస్తి, మే 26(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం భక్తుల రద్దీ నెలకొంది. వేసవి సెలవులతో పాటు అమావాస్య ఘడియలు కలిసి రావడంతో రెండు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 30 వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.500 అంతరాలయ దర్శనం 548 మంది, రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 3,139, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 3,220మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 3,497మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,331, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 387, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 246, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 76మంది భక్తులు పూజలు చేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 24,991 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.

అల్లకల్లోలంగా సముద్రం



తూపిలిపాళెం సముద్ర తీరంలో ఎగిసిపడుతున్న అలలు

నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండంతో వాకాడు మండలం తూపిలిపాళెం సముద్రం అల్లకల్లోలంగా మారింది. సముద్రం నుంచి వీస్తున్న గాలులకు భారీ కెరటాలు ఉవ్వెత్తున ఎగిసిపడుతున్నాయి. ఆదివారం మధ్యాహ్నం నుంచి వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడంతో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. తూపిలిపాళెం, శ్రీనివాసపురం, మనపాళెం, వైట్‌కుప్పం తీరాలలో వాయుగుండం ప్రభావంతో సముద్రం ముందుకువచ్చిందని మత్స్యకారులు సోమవారం తెలిపారు. వాయుగుండం ప్రభావంతో రెండు గంటలపాటుగా ఎడతెరపిలేకుండా వర్షం పడింది.

- వాకాడు, ఆంధ్రజ్యోతి

గండి అంజన్నను దర్శించుకున్న మంత్రి అచ్చెన్నాయుడు


అంజన్నను దర్శించుకుంటున్న మంత్రి అచ్చెన్నాయుడు

చక్రాయపేట/ఒంటిమిట్ట మే 26 (ఆంధ్రజ్యోతి): గండి వీరాంజనేయ స్వామిని సోమవారం రాష్ట్ర పశుసంవర్ధక, వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు పూర్ణఫలంతో స్వాగ తం పలికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి గండి ఆంజనేయస్వామి చరిత్ర, పాపాఘ్ని పవిత్రత, మకరతోరణం లాంటివి అడిగి తెలుసుకున్నారు. స్వయాన శ్రీరామ చంద్రుడు లిఖించిన శిల్పం గండి క్షేత్రంలోనే ఉందని పూజారులు తెలపడంతో ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అలాగే ఒంటిమిట్ట కోదండ రామాలయాన్ని మంత్రి అచ్చెన్నాయుడు సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వాగతం పలికి పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ చరిత్ర గురించి వివరించారు. ఆలయంలో శిల్ప సంపద అద్భుతంగా ఉందని మంత్రి కొనియాడారు. గండి దేవస్థానం, ఒంటిమిట్ట ఆలయాల అర్చకులు , టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహానాడు భోజన వసతి ఏర్పాట్ల పరిశీలన


ఏర్పాట్లను పరిశీలిస్తున్న చీఫ్ విప్ ఆంజనేయులు, బీటెక్ రవి

పులివెందుల, మే 26 (ఆంధ్రజ్యోతి): కడప మహానాడుకు వచ్చే టీడీపీ శ్రేణులకు భోజన వసతి కల్పించేందుకు చురుగ్గా సాగుతున్న ఏర్పాట్లను ప్రభుత్వ చీఫ్ విప్ ఆంజనేయులు, పులివెందుల ఇన్ చార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి)లు పరిశీలించారు. కడపకు వెళ్లే దారిలో మెడికల్ కళాశాల సమీపంలో అనంతపురం జిల్లాలోని దాదాపు 10 నుంచి 12 నియోజకవర్గాల నుంచి మహా నాడుకు వచ్చే టీడీపీ శ్రేణులకు బీటెక్ రవి భోజన ఏర్పాట్లను చేప ట్టారు. అనంత పురం జిల్లా నుంచి వచ్చే టీడీపీ శ్రేణులు ఇక్కడ భోజనం చేసే అవకాశం ఉన్నందున ఈఏర్పాట్లను వీరు పరిశీలించారు.

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో తనిఖీ


విద్యార్థులతో మాట్లాడుతున్న
రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ కోటేశ్వరరావు

కడప మారుతీనగర్, మే 26 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న మహానాడు కార్యక్రమానికి విచ్చేసిన రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ జి.కోటేశ్వరరావు సోమవారం చిన్నచౌకు కొండాయపల్లెలో గల జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని సందర్శించారు. అక్కడ జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో పాల్గొని విద్యార్థులతో ముచ్చటించారు. గ్రంథాలయ రెఫరెన్స్ సెక్షన్‌లో డీఎస్సీ, కానిస్టేబుల్ ఉద్యోగాలకు ప్రిపేర్ అవుతున్న నిరుద్యోగ యువతతో మాట్లాడారు. పోటీ పరీక్షలకు కావాల్సిన పుస్తకాలను విద్యార్థులకు అందుబాటులో ఉంచాలని సంబంధిత కార్యదర్శికి సూచించారు. జిల్లా కేంద్ర గ్రంథాలయ నూతన భవన నిర్మాణానికి రూ.కోటి నిధులు విడుల చేశామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి అమీ రుద్దీన్, అసిస్టెంటు లైబ్రేరియన్లు తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లె పంచాయతీలో అవినీతిపై విచారణ

● ప్రాథమికంగా రూ.8లక్షల అవినీతి జరిగినట్లు నిర్ధారణ

వేంపల్లె, మే 26 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పంచాయతీలో జరిగిన అవినీతిపై పులివెందుల డీఎల్‌పీఓ భూమిరెడ్డి రమాదేవి ఆధ్వర్యంలో విచారణ సాగుతోంది. వీఎన్‌పల్లె డిప్యూటీ ఎంపీడీఓ రామ్ సింగ్, ఇతర అధికారులు ఈ విచారణ కొద్దిరోజులుగా చేస్తున్నారు. 2019 నుంచి 2022 వరకు అప్పట్లో పనిచేసిన ఈఓ, జూనియర్ అసిస్టెంట్, సిబ్బందిపై అవినీతి ఆరోపణలు రావడంతో ఈ విచారణ నిర్వహిస్తున్నారు. నీటిపన్ను, ఇంటిపన్ను, ఇంటి ప్లానింగ్ అప్రూవల్ కోసం చెల్లించిన రసీదులను ఇప్పటి వరకు పరిశీలించి విచారణ జరిపారు. ఇందులో సుమారు రూ.8లక్షల మేర అవినీతి జరిగినట్లు ప్రాథమికంగా బయటపడినట్లు అధికారుల సమా చారం. ఇక పనులు జరిగిన ఎంబుక్కులు, ఇతర రికార్డులను తనిఖీ చేయాల్సి ఉంది. ఈ విషయమై డీఎల్‌పీఓ రమాదేవి మాట్లాడుతూ విచారణ దాదాపుగా పూర్తయ్యిందని మరికొద్ది రోజుల్లో పూర్తిచేసి నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని తెలిపారు. అనంతరం ఈఓ రామసుబ్బారెడ్డి, పంచాయతీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వేంపల్లెలో పారిశుధ్యం మెరుగ య్యేందుకు, తాగునీటి సరఫరా సక్రమంగా జరిగేలా చర్యలు చేపట్టాలని డీఎల్‌పీఓ రమాదేవి సూచించారు. పంచాయతీ ప్రధాన సమస్యల గురించి చర్చించారు.

యోగా దినోత్సవంలో 10 లక్షల మంది పాల్గొనేలా కృషి

● అన్నమయ్య జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి(కలెక్టరేట్), మే 26 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్టణంలో జూన్ 21న నిర్వహించే 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం కార్యక్రమానికి జిల్లా నుంచి పది లక్షల మంది పాల్గొనేలా కృషి చేస్తున్నామని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి దేశ ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాల్గొంటారని.. రాష్ట్ర వ్యాప్తంగా రెండు కోట్ల మంది హాజరయ్యేలా ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇందులో భాగంగా మన జిల్లా నుంచి పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొనేలా ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ఈ నెల 28న జిల్లా ఇన్‌చార్జి మంత్రి, జిల్లా మంత్రి వర్యులు ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, అంగన్వాడీ హెల్పర్లు, టీచర్లు, ఆశా, హెల్త్‌వర్కర్లు, జిల్లా అధికారులు తదితరులు 5 వేల మందితో మదనపల్లి బీటీ కాలేజీ గ్రౌండ్‌లో ఉదయం 6 నుంచి 8 గంటల వరకు ఒకే చోట యోగా నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. యోగాంధ్ర లింక్, క్యూఆర్ కోడ్ ద్వారా జిల్లాలో ఇప్పటి వరు 4232 ట్రైనర్లు, 72,691 మంది ప్రజలు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, విస్తృత అవగాహన కల్పించడం ద్వారా ఎక్కువ సంఖ్యలో జిల్లా నుంచి రిజిస్టర్ చేసుకునేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. 28న నిర్వహించే యోగా కార్యక్రమంలో మీడియా వారికి కూడా ప్రత్యేకంగా గ్యాలరీ ఏర్పాటు చేస్తామని, యోగాలో పాల్గొని కార్యక్రమాన్ని విస్తృతంగా కవరేజ్ చేయాలని కలెక్టర్ కోరారు. సమావేశంలో జేసీ ఆదర్శ్ రాజేంద్రన్ పాల్గొన్నారు.

యువరైతు ఆత్మహత్య...

● పంటల సాగులో నష్టాలు రావడం..
● చేసిన అప్పులు తీర్చలేక...


రాహుల్‌రెడ్డి (ఫైల్)

పెద్దతిప్పసముద్రం, మే 26 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగం వదిలి వ్యవసాయంపై మక్కువతో స్వగ్రామానికి వచ్చి పంటలు సాగుచేసి నష్టపోయిన యువరైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పీటీఎం మండలం తుమ్మరకుంట గ్రామ పంచాయతీ బురదవాండ్లపల్లెలో జరిగింది. బురదవాండ్లపల్లెకు చెందిన గంగిరెడ్డి కుమారుడు రాహుల్ రెడ్డి (25) ఇంజనీరింగ్ పూర్తి చేసుకుని బెంగళూరులో కొన్నాళ్ల పాటు ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేశాడు. అయితే వ్యవసాయంపై ఉన్న మక్కువతో మూడు సంవత్సరాల క్రితం స్వగ్రామానికి చేరుకున్నాడు. తన దగ్గర ఉన్న పెట్టుబడితో వ్యవసాయం ప్రారంభించాడు. పెట్టిన పంటలు సక్రమంగా చేతికి అందకపోవడంతో తిరిగి పలువురి దగ్గర అప్పులు చేసి దోస, టమోట, కర్బూజ పంటలు సాగు చేశాడు. పంటలు బాగా పండినా ధరలు లేక పోవడంతో వరుసగా నష్టాలు వచ్చాయి. ఎంతో ఆశతో వ్యవసాయ రంగంలోకి దిగిన యువరైతుకు కష్టాలు కన్నీళ్లే మిగిలాయి. పంటల ద్వారా పూర్తిగా నష్టపోవడం, అప్పుల బాధ ఎక్కువ కావడంతో మనస్థాపానికి గురై ఈనెల 16న పొలం వద్దే పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కుటుంబీకులు తిరుపతిలోని స్విమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. బాగా చదువుకుని ఉద్యోగం చేస్తూ తమకు అండగా ఉంటాడనుకున్న కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు భోరున విలపించారు. యువరైతు ఆత్మహత్యతో బురదవాండ్లపల్లెలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పీటీఎం పోలీసులు తెలిపారు.

గుండెపోటుతో ఉపాధి కూలి మృతి

రామాపురం, మే 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచపల్లి పంచాయతీకి చెందిన టేకూరి రెడ్డెన్న (69) అనే ఉపాధి కూలి గుండెపోటుతో సోమవారం మృతి చెందినట్లు ఏపీవో పెంచలయ్య తెలిపారు. రోజు మాదిరే సోమవారం కూడా ఉపాధి పనికి వెళ్లి అక్కడ కాలువలో పూడికతీత పనులు చేసి తిరిగి ఇంటికి తనతో పాటు కూలీలందరూ వస్తూ ఉండగా మార్గ మధ్యంలోకి రాగానే ఒక్కసారిగా గుండెపోటు రావడంతో కిందపడి అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు.

చాక్లెట్ ఇప్పిస్తానని ఆశ చూపి.. చిన్నారులను మభ్యపెట్టిన అపరిచిత వ్యక్తి

● దేహశుద్ధి చేసిన కుటుంబసభ్యులు ● పోలీసులకు అప్పగింత

జమ్మలమడుగు, మే 26 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు నియోజకవర్గంలోని ఎ.కంబాలదిన్నె గ్రామంలో మూడేళ్ల చిన్నారిపై జరిగిన ఘటనను ప్రజలు ఇంకా మరువకముందే మరో చిన్న ఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తితే... జమ్మలమడుగు నుంచి కోవెలకుంట్ల వెళ్లే బైపాస్ సర్కిల్ పక్కన శివారెడ్డి కాలనీ ఉంది. అక్కడ ఆదివారం 24 ఏళ్ల ఓ వ్యక్తి అక్కడే ఉన్న ఇద్దరు 5 నుంచి 7 సంవత్సరాలు వయస్సు గల చిన్నారులకు చాక్లెట్ ఇప్పిస్తానని ఆశచూపి రోడ్డుపైకి పిలుచుకు వెళుతుండగా.. స్థానికులు గమనించి వెంటనే కుటుంబ సభ్యులకు చెప్పారు. దీంతో ఆ వ్యక్తికి అక్కడే దేహశుద్ధి చేసి అర్బన్ పోలీసు స్టేషన్‌లో పోలీసులకు అప్పగించినట్లు తెలిసింది. ఈ సందర్భంగా ఎస్‌ఐ రామకృష్ణ మాట్లాడుతూ తమకు రాబడిన సమాచారం మేరకు ఘటనాస్థలానికి వెళ్లి విచారించామన్నారు. చిన్నారుల తల్లిదండ్రులు చెప్పిన వివరాల మేరకు ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామన్నారు. ఇలాంటి ఘటనలు ఎక్కడా జరుగకుండా చర్యలు చేపడుతున్నామని ఎస్‌ఐ తెలిపారు. ఎవరైనా అపరిచిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ తెలిపారు.

బైకును ఢీకొన్న కారు.. వ్యక్తి మృతి


మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబసభ్యులు,
పెద్దిరెడ్డి వెంకటరెడ్డి (ఫైల్)

పోరుమామిళ్ల, మే 26 (ఆంధ్ర జ్యోతి): మోటారుబైకును కారు ఢీకొన్న సంఘటనలో వెంకటరెడ్డి (55) అనే వ్యక్తి మృతి చెందాడు. పోరుమామిళ్ల మండలంలోని కొండుగారిపల్లెకు చెందిన పెద్దిరెడ్డి వెంకటరెడ్డి అనే కాంట్రాక్టరు సోమవారం సొంత పని నిమిత్తం మోటారు బైకులో బద్వేలు వైపు వెళుతుండగా చెన్నారెడ్డిపేట సమీపంలో కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.
ఈవిషయం తెలియడంతో కుటుంబ సభ్యులు, బంధువులు ప్రభుత్వ ఆసుపత్రి వద్ద బోరున విలపించారు. జిల్లా పరిషత్ చైర్మన్ రామగోవిందురెడ్డి, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ రమణారెడ్డి, వైసీపీ అదనపు సమన్వయకర్త విశ్వనాథ రెడ్డి మృతుని స్వగృహానికి వెళ్లి నివాళులర్పించారు.

వ్యక్తిపై దాడి.... కేసు నమోదు

పులివెందుల, మే 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని క్రిస్టియన్ కాలనీలో గత రాత్రి ఓ వ్యక్తిపై జరిగిన దాడికి సంబంధించి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఆదివారం రాత్రి 10.30 గంటల సమయంలో పట్టణంలోని క్రిస్టియన్‌కాలనీలో కుమార్ అనే వ్యక్తిపై లక్కి, రెమో, రాజన్న, దానమయ్యలు ఇనుప కడ్డీలతో దాడి చేశారన్నారు. ఈ దాడిలో కుమార్‌కు రక్తగాయాలయ్యాయి. బాధితుడు కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కుక్కల దాడిలో పొడదుప్పి మృతి



పెనగలూరు, మే 26 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని సింగారెడ్డిపల్లె కంబాలకుంట గ్రామాల మధ్యలో ఉన్న సిద్దిగారికుంటలో సంచరి స్తున్న పొడదుప్పిపై కుక్కలు దాడి చేసి చంపివేశాయి. చిట్వేలి ఫారెస్ట్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో ఎఫ్ఎస్‌వోలు సావిత్రి, ఎఫ్‌బీవోలు కేవీ సుబ్బయ్య, సుబ్బరాయుడు సంఘటన స్థలానికి చేరుకుని దుప్పి కాకర్లవారిపల్లె వెటర్నరి ఆసుపత్రికి తరలించారు. వెటర్నరీ డాక్టర్ వేదవతి పొడదుప్పికి పోస్టుమార్టం నిర్వహించారు. కాగా, ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నన ఎక్కడా తాగునీటికి కొరతలేదని, కంపచెట్లలో రాలిపోయిన కాయలను తినేందుకు వచ్చి కుక్కల దాడిలో మృతి చెందిందని అటవీశాఖ సిబ్బంది తెలిపారు.

విద్యుదాఘాతంతో తాపీ మేస్త్రీ మృతి


అప్సర్‌పాషా మృతదేహం

పీలేరు, మే 26 (ఆంధ్ర జ్యోతి): విద్యుదాఘాతంతో తాపీ మేస్త్రీ మృతి చెందాడు. పీలేరు పట్టణం తిలక్ వీధిలో కాపురముంటున్న అప్సర్‌పాషా(40) తాపీ మేస్త్రీగా పని చేస్తుండేవాడు. సోమవారం ఉదయం ఏపీఐఐసీ-3 లేఔట్ లోని ఓ ఇంటి నిర్మాణ పనులకు వెళ్లాడు. అక్కడ పనిచేస్తుండగా విద్యుత్ తీగలు తగలడంతో షాక్‌కు గురయ్యాడు. ఈవిషయాన్ని గమనించిన ఇంటి యజమాని, సహచర కూలీలు అతన్ని హుటాహుటిన పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తేల్చారు. అప్సర్ పాషాకు భార్య అప్సా ఫాతిమా, ముసాద్(10), ఖతీజా(8) అనే ఇద్దరు పిల్లలున్నారు. అప్సర్‌పాషా మృతితో బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడు దుర్మరణం


బాలుడి మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

పెద్దతిప్పసముద్రం, మే 26 (ఆంధ్రజ్యోతి): ఓ లారీ అతి వేగంతో రావడంతో ఓ బాలుడు అక్కడికక్కడే మృతి చెందిన విషాదకర సంఘటన మండలంలోని వరికసువుపల్లెలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు... తుమ్మర కుంట పంచాయతీ వరికసువుపల్లెకు చెందిన సుధాకర్ రెడ్డి కుమారుడు పురిసిత్ రెడ్డి (14) మెయిన్ రోడ్డు మీద ఆడు కుంటుండగా ఓ కెమికల్ లారీ బి.కొత్తకోట వైపు నుంచి కర్ణాటక రాష్ట్రం చెలూరు వైపు వెళ్లేందుకు అతి వేగంగా వెళుతూ బాలుడిని ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన స్థానికులు డ్రైవర్‌ను అదు పులోకి తీసుకుని పీటీఎం పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

మదనపల్లె అర్బన్, మే 26 (ఆంధ్రజ్యోతి): ప్రియుడి మీద కోపంతో ఒంటిమీద పెట్రోల్ పోసుకొని గాయాలపాలైన మహిళ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. టూటౌన్ పోలీసుల కథనం మేరకు.. కర్ణాటక రాష్ట్రం, చింతామణికి చెందిన మాలరాణి(29) ఈ నెల 23వ తేదీ మదనపల్లెకు ప్రియుడితోపాటు వచ్చింది. ఇక్కడే పట్టణంలో కోమటివాని చెరువు వద్ద పెట్రోల్ పోసుకుని నిప్పు పెట్టుకుంది. గాయపడిన ఆమెను మదన పల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలిం చారు. ఇక్కడ డాక్టర్లు ప్రథమ చికిత్సను అందించి మెరు గైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. తిరు పతి రూయాలో శవపరీక్షలు నిర్వహించి మృతదేహాన్ని చింతామణికి తరలించారు. ఈమేరకు టూటౌన్ సీఐ రామ చంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ముగ్గురు మహిళా వైద్యుల బదిలీ

కలికిరి, మే 26 (ఆంధ్రజ్యోతి): కడప, అన్నమయ్య జిల్లాల్లో ముగ్గురు మహి ళా వైద్యులను బదిలీ చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసిం ది. కడప ప్రభుత్వ వైద్య కళాశాలలో అనటమీ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ సి.యామినీ దేవిని తిరుపతి ఎస్వీ వైద్య కళాశాలకు బదిలీ చేసింది. భార్యా, భర్తల కారణంతో ఖాళీగా వున్న పోస్టులోకి ఆమెను నియమించింది. అదే విధంగా వేంపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సివిల్ అసిస్టెంట్ సర్జన్ హోదాలో పనిచేస్తున్న డాక్టర్ యు.బి. లక్ష్మీప్రియను అదే హోదాతో తిరుపతి గొల్లపల్లె పీహెచ్‌సీకి బదిలీ చేశారు. ఈ బదిలీ కూడా భార్యా భర్తల కారణంతోనే జరిగింది. ఇక అన్నమయ్య జిల్లా గాలివీడు సీహెచ్‌సీలో పని చేస్తున్న డాక్టర్ కె.రాధామాధవిని ఖాళీగా వున్న ఇదే జిల్లాలోని పీలేరు మండలం రేగళ్ళ పీహెచ్‌సీకి బదిలీ చేశారు. రాష్ట్ర ఆరోగ్య, వైద్య, కుటుంబం సంక్షేమ శాఖ కార్యదర్శి డాక్టర్ మంజులా డి.హోస్మణి సోమవారం వేర్వేరుగా మూడు బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు.

జిల్లా వ్యాప్తంగా రైతు సమావేశాలు

కలికిరి, మే 26 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లాలోని 30 మండ లాల్లో మండలాల వారీగా రైతు సదస్సులు నిర్వహించనున్నట్లు కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ మంజుల తెలిపారు. ఈ సందర్భంగా ఈ నెల 29వ తేదీ నుంచి జూన్ 12 వరకు వికసిత్ కృషి సంకల్ప అభి యాన్‌లో భాగంగా రైతులతో చర్చాగోష్ఠి నిర్వహిస్తామన్నారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ముందస్తు వ్యవసాయ ప్రణాళికను కేవీకే శాస్త్రవేత్తల బృందం, స్థానిక వ్యవసాయాధికారులు, ఆర్ఎస్కే సిబ్బందితో కలిసి వ్యవసాయం, దాని అనుబంధ రంగాలకు సంబంధించిన చర్చలు జరుపుతామని చెప్పారు. వీలైన చోట్ల ఇఫ్కో సహకారంతో డ్రోన్ స్ప్రేయింగ్ ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కేవీకే శాస్త్రవేత్తలతో పాటు వివిధ పరిశోధనా స్థానాల నుంచి రానున్న నిపుణులు, శాస్త్రవేత్తలు నేరుగా రైతులతో కొత్త రకం వంగడాలు, ఆధు నిక సాంకేతికతపై అవగాహన కల్పించనున్నట్లు వివరించారు. పశు పోషణ, విలువ ఆధారిత ఉత్పత్తులు, సేంద్రియ వ్యవసాయం లాంటి వివిధ అంశాలపై రైతులకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. స్థానికంగా వివిధ పంటలను పరిశీలించి తరచూ ఆశించే తెగుళ్ల, ఇతర సమస్యలు వాటి నివారణ మార్గాలపై రైతులకు అవగాహన కల్పిస్తామని వివరించారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి వృద్ధురాలు మృతి

పెద్దమండ్యం, మే 26(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు ఊటకుంటలో పడి వృద్ధురాలు మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసుల వివరాల మేరకు మండలంలోని వెలిగల్లులో నివాసం వుంటున్న సాలమ్మ(70) భర్త చనిపోవడంతో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. గత మంగళవారం సాయంత్రం నుంచి గ్రామంలో కనబడటంలేదు. సోమవారం ఉదయం వెలిగల్లు చెరువు సమీపంలోని ఊటకుంటలో సాలమ్మ శవమై కనిపించింది. సమాచారం అందుకున్న పెద్దమండ్యం పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. గత వారం కురిసిన వర్షంలో సారా మత్తులో సాలమ్మ ఇంటికొస్తూ మార్గంలోని కుంటలో జారిపడి మృతి చెంది వుంటుందని పలువురు అనుమానాలు వ్యక్తం చేశారు. మృతురాలి కుమార్తె లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. మృతదేహాన్ని శవపరీక్షల నిమిత్తం మదనపల్లి జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

చట్టసభల్లో రిజర్వేషన్లు సాధించడమే లక్ష్యం

● రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య


మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

ప్రొద్దుటూరుటౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి): చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు సాధించడమే తమ లక్ష్యమని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు ఆర్.కృష్ణయ్య పేర్కొన్నారు. సోమవారం ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బీసీల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీతోనే రిజర్వేషన్ల కల సాకారం అవుతుందన్నారు. మిలిటెంట్ తరహా పోరాటాలతోనే అనేక బీసీ సంక్షేమ పథకాలను సాధించామని, దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఏపీ, తెలంగాణాలో బీసీల కోసం ఉద్యమించామని తెలిపారు. అందువలన ఆ రెండు రాష్ట్రాల్లో బీసీలకు సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని పేర్కొన్నారు. కాగా గతంలో ఏ ప్రభుత్వం కులగణన చేయడానికి ముందుకు రాలేదని, 96 ఏళ్ల తర్వాత ప్రధాని మోదీని కులగణన చేయడానికి ఒప్పించామన్నారు. అనంతరం జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు నూకాలమ్మలు మాట్లాడుతూ బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ, జనాభా దామాషా ప్రకారం బీసీలకు ప్రత్యేక బడ్జెట్, బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు, మహిళా రిజర్వేషన్లలో బీసీలకు ప్రత్యేక కోటా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్.కృష్ణయ్యను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, బీసీ సమాఖ్య అధ్యక్షుడు డాక్టర్ సోమా లక్ష్మీనరసయ్య, సహ అధ్యక్షుడు నందు శివనారాయణ, రాష్ట్ర సెక్రటరీ జనరల్ డీవీ రాజు, జిల్లా అధ్యక్షుడు జింకా జయప్రకాశ్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీదేవి, శివనారాయణయాదవ్, గురుమూర్తి, బాలకృష్ణయాదవ్, సువాంతి, రాష్ట్ర కార్యదర్శి రెడ్డయ్య, విజయకుమార్, సాధు గోపాల కృష్ణ, ప్రభుకుమార్, తదితరులు పాల్గొన్నారు.



ముస్తాబైన వేదిక


మహానాడు నిర్వహణ కోసం ప్రాంగణాన్ని సుందరంగా ముస్తాబు చేశారు. తొలి రెండురోజులు జరిగే 23వేల మంది కోసం వేదిక తయారు చేశారు. డయాస్‌పై 450 మంది కూర్చునే విధంగా రూపొందించారు. అటు పక్కనే సీఎం చంద్రబాబు సీఎంవో క్యాంపు ఆఫీసు, రక్తదాన శిబిరం, ఫొటో ఎగ్జిబిషన్, డైనింగ్, మీడియా పాయింట్, సమీపంలోనే 300 ఎకరాల్లో పార్కింగ్ ఏర్పాటు చేశారు. చివరి రోజు బహిరంగసభకు ఐదు లక్షల మందితో నిర్వహించనున్నారు. వేదిక కూడా దాదాపు పూర్తయింది. అయితే సోమవారం కూడా పలుమార్లు వర్షం కురిసి ఏర్పాట్లకు అడ్డంకి కలిగించింది.



ముస్తాబైన వేదిక


స్వచ్ఛాంధ్ర డ్రెస్ కోడ్ ధరించి మహానాడు వేదికపై నుంచి సంఘీభావం తెలుపుతున్న మంత్రులు అచ్చెన్నాయుడు, నిమ్మల రామానాయుడు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి, ఎమ్మెల్యే పులివర్తి నాని, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి తదితరులు

కడప నగర శివారులోని పబ్బాపురం వద్ద 125 ఎకరాల్లో నిర్వహించనున్న మహానాడు పండుగకు సర్వం సిద్ధమైంది. వేదికను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు ప్రతినిధుల సభ, బహిరంగసభకు వేర్వేరుగా ఏర్పాట్లు చేశారు. మంగళ, బుధ, గురువారాల్లో మహానాడు కార్యక్రమం జరగనుంది. మహానాడు నిర్వహణ కోసం నాలుగు రోజులుగా మంత్రుల బృందం నిర్విరామంగా పనిచేసింది. మహానాడులో పాల్గొనేందుకు సోమవారం రాత్రి సీఎం చంద్రబాబునాయుడు ప్రత్యేక విమానంలో విజయవాడ నుంచి కడపకు చేరుకోగా, కుప్పం నుంచి రోడ్డు మార్గాన టీడీపీ జాతీయ కార్యదర్శి నారాలోకేశ్ సైతం వచ్చారు. ఇరువురూ వేదిక వద్దనే బస చేశారు.


మహానాడు ప్రాంగణానికి చేరుకున్న మంత్రి నారా లోకేశ్


కడప విమానాశ్రయంలో సీఎం చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ శ్రీధర్, పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి


మహానాడు ప్రాంగణం వద్ద సీఎం చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి, రితేష్‌రెడ్డి తదితరులు


చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్, ఎంపీ పుట్టా మహేశ్‌యాదవ్

నేటి నుంచి మహాపండుగ

- మూడురోజుల పాటు మహానాడు
- కనీవినీ ఎరుగని రీతిలో ఏర్పాట్లు

- సర్వం సిద్ధం
- అతిథులకు సీమ వంటకాలతో విందు
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అతిథులకు బస
- కడపకు చేరుకున్న సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్

(కడప-ఆంధ్రజ్యోతి): కడపలో నిర్వహించే మహానాడును టీడీపీ చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. మాజీ సీఎం జగన్ జిల్లా కావడంతో పాటు సీమలో గతంలో ఎన్నడూ లేని విధంగా 45 అసెంబ్లీ స్థానాలను కూటమి గెలుచుకుంది. ఈ నేపథ్యంలో సీమ నడిబొడ్డు అయిన కడపలో గతానికి భిన్నంగా మహానాడును నిర్వహించాలని నిర్ణయించారు. ఏర్పాట్లకు వర్షం అడ్డంకిగా మారినా 19 కమిటీలు వేసుకుని పనులను యుద్ధ ప్రాతిపదికన చకచకా చేసేశారు. గత మహానాడులను మించి ఏర్పాట్లు చేశారు.

మొదటిరోజు ఇలా..

మంగళవారం ఉదయం 8.30 గంటల నుంచి ప్రతినిధుల నమోదు కార్యక్రమం జరగనుంది. టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు నమోదుతో ఈ కార్యక్రమం మొదలు అవుతుంది. 10.30కి ఫొటో ఎగ్జిబిషన్ ప్రారంభిస్తారు. 10.30 నుంచి 10.45 వరకు రక్తదాన శిబిరం నిర్వహిస్తారు. 10.45 నుంచి 11 వరకు పార్టీ అధ్యక్షులు, పొలిట్‌బ్యూరో సభ్యులు ఇతర ముఖ్య నాయకులను వేదికపైకి ఆహ్వానించి పార్టీ జెండా ఆవిష్కరిస్తారు. 11 నుంచి 11.05 వరకు జ్యోతిప్రజ్వలన, పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్టీఆర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తారు. 11.05 నుంచి 11.10 వరకు తెలుగు తల్లి గీతాలాపన, 11.10 నుంచి 11.20 వరకు మరణించిన కార్యకర్తలకు నేతల సంతాపం, 11.20 నుంచి 11.30 వరకు జాతీయ ప్రధాన కార్యదర్శి నివేదిక, 11.30 నుంచి 11.45 వరకు ఏపీ రాష్ట్ర అధ్యక్షుడి ప్రసంగం ఉంటాయి. 11.45 నుంచి పార్టీ జమాఖర్చుల నివేదిక, 11.50 నుంచి 12.45 వరకు జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ప్రారంభ ఉపన్యాసం చేస్తారు. మధ్యాహ్నం 12.45 నుంచి ఒంటిగంట వరకు టీడీపీ మౌలిక సిద్ధాంతాలు, ఆరుసూత్రాల నియమావళిలో సవరణలు అంశంపై చర్చించనున్నారు. ఒంటిగంట నుంచి 1.05 వరకు జాతీయ అధ్యక్షుల ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల చేస్తారు. 1.05 నుంచి 2 వరకు భోజన విరామం. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు, మధ్యాహ్నం 2 నుంచి 5 వరకు ఆరుసూత్రాల్లో భాగంగా 'కార్యకర్తనే అధినేత', 'యువగళం' అంశాలపై చర్చ ఉంటాయి. సాయంత్రం 5 నుంచి 6.30 వరకు రాష్ట్రంలో అభివృద్ధి వికేంద్రీకరణ, వెనుకబడ్డ ప్రాంతాలపై శ్రద్ధ, మౌలిక సదుపాయాల కల్పన, మారుతున్న రాష్ట్ర ముఖచిత్రం, విద్యుత్‌రంగంలో విప్లవాత్మక మార్పులపై చర్చించనున్నారు. తొలి రెండురోజులు జరిగే పార్టీ ప్రతినిధుల సమావేశానికి 23వేల మందిని ఆహ్వానించారు. పార్టీ సిద్ధాంతాలు, చేసిన అభివృద్ధిని వివరిస్తారు.

రెండోరోజు

ఉదయం 10గంటలకు మహానాడు ప్రారంభం అవుతుంది. ఉదయం 10 గంటల నుంచి 10.15 వరకు యుగపురుషుడు ఎన్టీఆర్ 102వ జయంతి సందర్భంగా ఘన నివాళి, 10.15 నుంచి ఒంటిగంట వరకు ఆరుసూత్రాల్లో మూడో అంశమైన తెలుగు జాతి విశ్వఖ్యాతి, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 వరకు ఆరుసూత్రాల్లో 4, 5, 6 అంశాలైన స్త్రీశక్తి సామాజిక న్యాయం, పేదల ప్రగతి, అన్నదాత అండ అంశాలపై చర్చిస్తారు. 4.30 నుంచి 5 వరకు సమగ్ర నీటి ప్రణాళికలో ఉజ్వల ప్రగతి, ప్రజల సంరక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ అంశాలపై తీర్మానం, సాయంత్రం 5గంటల నుంచి 6 వరకు రాజకీయ తీర్మానం, 6 నుంచి 7 వరకు జాతీయ అధ్యక్షుడి ఎన్నిక ప్రకటన, ప్రమాణ స్వీకారం, ప్రసంగం ఉంటాయి. ఇక మూడోరోజు మధ్యాహ్నం 2గంటల నుంచి బహిరంగసభ ఉంటుంది.

మంత్రుల బృందం బిజీబిజీ

మహానాడు ఏర్పాట్లపై మంత్రుల బృందం సమీక్ష నిర్వహించింది. బహిరంగసభకు జన సమీకరణపై మంత్రులు గొట్టిపాటి రవికుమార్, నారాయణ, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, బీసీ జనార్థనరెడ్డి, ఎమ్మెల్యేలు అమర్‌నాథరెడ్డి, ఉగ్ర నరసింహారెడ్డి, అరమిల్లి రాధాక్రిష్ణ, చింతమనేని ప్రభాకర్, మార్కెట్‌యార్డు బోర్డు చైర్మన్ దామచర్ల సత్య పాల్గొని కడప ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. కాగా.. మహానాడులో క్లీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్యక్రమాలను మంత్రి వాసంశెట్టి సుభాష్ పరిశీలించారు. స్వచ్ఛ మహానాడు కార్యక్రమానికి డ్రెస్‌కోడ్ జాకెట్లు ధరించాలన్నారు. పరిశుభ్రమైన ఆకర్షణీయమైన వేదికగా మార్చేందుకు అన్ని చర్యలు చేపట్టామన్నారు. మంత్రి అచ్చెన్నాయుడు, నిమ్మలరామానాయుడు, స్వచ్ఛాంధ్ర చైర్మన్ పట్టాభిరాం, బీసీ కార్పొరేషన్ చైర్మన్ సత్యబాబు, పద్మరాజు కమిటీలో ఉన్నారు. ఇక భోజనశాల వద్ద ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని మంత్రులు వంగలపూడి అనిత, అనగాని సత్యప్రసాద్, సవిత, ఉమ్మడి సంధ్యారాణి సమీక్ష నిర్వహించారు.

మహానాడు వేదిక ఏర్పాట్ల పరిశీలన

మహానాడు వేదిక ఏర్పాట్లను మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, బీసీ జనార్ధనరెడ్డి, వాసంశెట్టి సుభాష్, అచ్చెన్నాయుడు, గుండు సంధ్యారాణి, నారాయణ, మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యేలు ఆర్.మాధవి, పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, వరదరాజులరెడ్డి, చింతమనేని ప్రభాకర్, భూమా అఖిలప్రియ , పులివర్తి నాని తదితరులు పరిశీలించారు.

కడపకు చేరుకున్న ముఖ్యనేతలు

మహానాడు వేళ టీడీపీకి చెందిన నేతలంతా కడపకు చేరుకున్నారు. సోమవారం సాయంత్రానికే ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, అండమాన్ నికోబార్ నుంచి పలువురు టీడీపీ కార్యకర్తలు, నేతలు కడపకు వచ్చారు. వారిలో కొందరు మహానాడు వేదిక వద్దకు వచ్చారు. జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో వీరికి వసతి కల్పించారు.


అలంకరణ కమిటీ మహానాడులో 5000 చెట్లు ఏర్పాటు చేసిన టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వేమన సతీష్, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, మాజీ ఎమ్మెల్సీ, జోన్ కోఆర్డినేటర్ మంతెన సత్యనారాయణ

ఎన్టీఆర్ ఓ చరిత్ర - మంత్రి నిమ్మల రామానాయుడు



ఎన్టీఆర్ ఒక చరిత్ర. దేశానికి సంక్షేమం పరిచయం చేసిన వ్యక్తి నందమూరి తారకరామారావు, రూ.35 పెన్షన్‌తో పాటు మండల వ్యవస్థ, బలహీన వర్గాలకు 34 శాతం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ కల్పించారు. ఎన్టీఆర్ హయాంలో మహానాడు అత్యంత క్రమశిక్షణతో జరిగేది. ఆ వారసత్వాన్ని చంద్రబాబు కొనసాగించారు. సంస్థాగతంగా పార్టీని చంద్రబాబు బలోపేతం చేశారు. చంద్రబాబు పనితీరు మెచ్చుకుని యువత ప్రత్యేకంగా ఆకర్షితులయ్యారు. అలాగే చంద్రాబాబు ఒక ప్రత్యేక ముద్ర వేశారు. మహిళలకు డ్వాక్రా సంఘాలు, దీపం పథకం ద్వారా గ్యాస్, యువతకు, విద్య, ఉపాధి అమలుచేసిన ఘనత చంద్రబాబుదే. సాఫ్ట్‌వేర్ రంగాన్నీ తీసుకువచ్చారు. జాతీయ స్థాయిలో చక్రం తిప్పిన నాయకుడు చంద్రబాబు, భవిష్యత్తుకు స్ఫూర్తి నారాలోకేశ్. యువగళం పాదయాత్ర ద్వారా యువతకు ఆకర్షితులయ్యారు. మహిళలను ఏ విధంగా చైతన్యం చేయాలి, పార్టీని ఎలా బలోపేతం చేయాలన్న దానిపై పూర్తి దృష్టిసారించారు. భారతదేశంలో కోటికి పైగా సభ్యత్వం కలిగిన ఏకైక పార్టీ టీడీపీ.

ఐదు వేల మందితో బందోబస్తు

మహానాడు సందర్భంగా అన్ని రకాల భద్రతా ఏర్పాట్లు చేశారు. ఐదువేల మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నారు. జిల్లాలో 15 చోట్ల అన్ని జిల్లాల బార్డర్లలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. మహానాడు వేదిక భద్రతకు 15 మంది ఐపీఎస్ అధికారులు, 30 మంది అడిషనల్ ఎస్పీలు, 60మంది డీఎస్పీ స్థాయి, 200 మంది సీఐలు, ఎస్ఐలు పాల్గొననున్నారు. ట్రాఫిక్, పార్కింగ్‌లకు ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. ట్రాఫిక్ కోసం ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ ఏర్పాటు చేశారు. 120 కెమెరాలతో మహానాడు ప్రాంగణాన్ని పర్యవేక్షిస్తున్నారు. అత్యాధునిక డ్రోన్స్‌ను ఉపయోగిస్తున్నారు. ఎక్కడా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ప్రత్యేకంగా డైవర్షన్‌లు ఏర్పాటు చేశారు. సోమవారం కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్, కడప ఎస్పీ అశోక్‌కుమార్, ఇతర పోలీసు అధికారులు వేదిక ప్రాంతాన్ని పరిశీలించారు. రాష్ట్రంలోని వివిధప్రాంతాల పోలీసులు కడపకు చేరుకున్నారు. ప్రతినిధుల సభ, సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ బస చేసే ప్రాంతాలు, సీఎంవో ఆఫీసు, డైనింగ్, ఎంట్రీ, ట్రాఫిక్ అన్ని చోట్ల పరిశీలించి బందోబస్తుకు సూచనలు చేశారు.


బందోబస్తులో పోలీసులు

సిద్ధమవుతున్న మహా రుచులు



సీకేదిన్నె, మే 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా మహానాడుకు తరలి వస్తున్న వారికి మహారుచులు సిద్ధమవుతున్నాయి. వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు, నాయకులు వస్తుండడంతో వారి ఆహార అలవాట్లకు అనుగుణంగా మహానాడు ప్రాంగణంలో వివిధ రుచులతో వంటకాలు సిద్ధం చేస్తున్నారు. అందుకు అవసరమైన కూరగాయలు, ఆకుకూరలు, గుడ్లు, మాంసాహారం సిద్ధం చేస్తున్నారు. ఒకవైపు ఆహార పదార్థాలు, మరోవైపు స్వీట్లు, కూరలు, అన్నీ విడివిడిగా చేస్తూ అతిథులకు అందించేందుకు సిద్ధం చేస్తున్నారు. వచ్చిన అతిథులు మహానాడును గుర్తుంచుకునేలాగా వివిధ రకాల రుచులతో వంటలు సిద్ధం చేస్తున్నారు.

చట్ట పరిధిలో న్యాయం చేయండి

- ప్రజా ఫిర్యాదులను తక్షణం పరిష్కరించండి
- అదనపు ఎస్పీ వెంకటాద్రి

రాయచోటిటౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా విచారించి బాధితులకు చట్ట పరిధిలో న్యాయం చేయాలని జిల్లా అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అదనపు ఎస్పీ ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి వచ్చే దివ్యాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యత ఇవ్వడమే కాకుండా సత్వరమే ఆ ఫిర్యాదులపై సమగ్ర విచారణ జరిపి వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. అనంతరం ఫిర్యాదులను సంబంధిత పోలీస్‌స్టేషన్‌లకు బదిలీ చేసి ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని తెలిపారు.


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ వెంకటాద్రి

సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలి

రాయచోటి (కలెక్టరేట్), మే 26 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు బాధ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో బాధ్యతగా పరిష్కరించాలన్నారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. పేదరాలినైన తనకు సొంత స్థలం ఉన్నా ఇల్లు నిర్మించుకునే ఆర్థిక స్థోమత లేనందున ప్రభుత్వం తరపున ఇంటిని మంజూరు చేయాలని రాయచోటి మండలం దూదేకులపల్లికి చెందిన టి.అంజనమ్మ కలెక్టర్‌ను కోరింది. భర్తతో నేను విడాకులు తీసుకున్నానని, తన భర్త రేషన్ కార్డులో తన పేరు తొలగించినందున నాకు రేషన్‌కార్డు మంజూరు కావడం లేదని, పరిశీలించి సమస్యను పరిష్కరించి కొత్త రేషన్‌కార్డు మంజూరు చేయాలని వీరబల్లి మండలం ఈడిగపల్లికి చెందిన శరత్‌దీప్తి కోరింది. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్వో మధుసూదన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.


ప్రజల వద్ద నుంచి సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

పులిచెర్లను అన్నమయ్యలో కలపొద్దు

- మంత్రి నారా లోకేశ్‌కు వినతి

పీలేరు రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లాలో పులిచెర్ల మండలాన్ని కలపవద్దంటూ పలువురు తెలుగుదేశం పార్టీ నేతలు మంత్రి నారా లోకేశ్‌కు వినతిపత్రం అందచేశారు. బుధవారం రాత్రి కుప్పం నుంచి పీలేరు మీదుగా కడప మహానాడుకు వెళుతున్న మంత్రి నారా లోకేశ్‌ను పీలేరు శివారు ప్రాంతం చిత్తూరు మార్గంలోని ఎంజేఆర్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద పలువురు పులిచెర్ల మండల తెలుగుదేశం పార్టీ నేతలు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మంత్రితో మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి మీ వెన్నంటే ఉన్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో జిల్లాల పునర్విభజనలో భాగంగా పుంగనూరు నియోజకవర్గం చిత్తూరు జిల్లాలో కలిపారని వివరించారు. తాజాగా పుంగనూరు నియోజకవర్గాన్ని అన్నమయ్య జిల్లాలో కలుపుతూ గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చారని తెలిపారు. పులిచెర్ల మండలంతో పాటు నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాలను అన్నమయ్య జిల్లాలో కలపడం తీవ్ర ఆవేదనకు గురిచేస్తోందని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. పులిచెర్ల మండలాన్ని తిరుపతి లేదా చిత్తూరు జిల్లాలో విలీనం చేయాలని మంత్రిని కోరారు. టీడీపీ నేతల నుంచి వినతిపత్రం తీసుకున్న మంత్రి నారా లోకేశ్ దీనిపై చర్చిస్తామని తెలిపారు. అనంతరం కడపకు పయనమయ్యారు. మంత్రిని టీడీపీ సీనియర్ నేత రామనాథంనాయుడు ఆధ్వర్యంలో కలిశారు. పులిచెర్ల మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన టీడీపీ నేతలు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు.


పీలేరు సమీపంలో మంత్రి నారా లోకేష్‌తో మాట్లాడుతున్న పులిచెర్ల టీడీపీ నేతలు

29న మాతాంగ మహాపీఠం మహాహోమం

లక్కిరెడ్డిపల్లె, మే 26(ఆంధ్రజ్యోతి): ఈ నెల 29వ తేదీన మాతాంగ మహాపీఠం మహాయజ్ఞ హోమం నిర్వహిస్తున్నట్లు మాతాంగ పీఠాధిపతి మాతాంగ గిరి మహాస్వామి తెలిపారు. గురువారం మహాపీఠం శిలాశాసనంతో ప్రారంభిస్తారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో హిందూ ధర్మ నాయకులు డాక్టర్ సుబ్బారెడ్డి, గంగిరెడ్డి, రామచంద్రారెడ్డి, గురుస్వామి, రమణ, నల్లగొల్ల గంగాధర్, కృష్ణ పాల్గొన్నారు.

మహంకాళి జాతరకు సహకరించండి

పెనగలూరు, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బెస్తపల్లె గ్రామంలో జూన్ 1 ఉజ్జయిని మహంకాళి అమ్మవారి జాతర జరుగుతుందని, జాతరకు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి సహకరించాలని జాతర కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు వారు సోమవారం సాయంత్రం ఏఎస్ఐ రాముడుకు వినతిపత్రం ఇచ్చారు. ఈనెల 31న సాయంత్రం పొలిమేర నుంచి గంగమ్మ ఊరేగింపు మహంకాళమ్మ దేవాలయం వరకు జరుగుతుందని, జూన్ 1న తెల్లవారుజాము నుంచి జాతర ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో రాగూరు రవిశంకర్, మలిశెట్టి రమణయ్య, వెంకటకుమార్, పెంచలయ్య, శివయ్య పాల్గొన్నారు.

రేపటి నుంచి మాతమ్మ తిరునాళ్లు

సుండుపల్లె, మే 26(ఆంధ్రజ్యోతి): సుండుపల్లె మండల కేంద్రానికి సమీపంలోని పెద్దమాదిగపల్లెలో వెలిసిన మాతమ్మ తిరునాళ్లు ఈనెల 28వ తేదీ నుండి నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 28న అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకంతో పాటు బ్రహ్మోత్సవం, 29న గావు పట్టుట, పుట్ట బంగారం తేవుట, పొంగుపాలు, సిద్దులకు ఒక్కపొద్దు కార్యక్రమాలు, అదే రోజు రాత్రి చాందినీ బండ్ల ఊరేగింపు జరుగుతుందన్నారు.

29న ఉచిత కంటి వైద్యశిబిరం

సుండుపల్లె, మే26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన సుండుపల్లెలోని ఆరెమ్మ ఆలయం వద్ద ఈనెల 29వ తేదీన ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త యర్రపురెడ్డి ఆరెంరెడ్డి తెలిపారు. స్వర్గీయ యర్రపురెడ్డి సుబ్బారెడ్డి, స్వర్గీయ లక్ష్మీదేవమ్మల జ్ఞాపకార్థం తిరుపతి శ్రీవెంకటేశ్వర అరవింద కంటి ఆసుపత్రి సహకారంతో ఈ వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అవసరమైన వారిని ఆపరేషన్లకు ఎంపిక చేసి అదేరోజు తిరుపతికి తీసుకెళ్లి ఆపరేషన్ చేయిస్తామని తెలిపారు. వైద్యశిబిరానికి వచ్చేవారు ఆధార్‌కార్డు, సెల్‌ఫోన్ తీసుకురావాలన్నారు.

కొత్తకోడూరు గంగమ్మ జాతరకు ఏర్పాట్లు

రైల్వేకోడూరు, మే 26(ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరు పంచాయతీ పరిధిలో ఉన్న కొత్తకోడూరులో ఈనెల 28, 29, 30 తేదీల్లో గంగమ్మ జాతర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందుకు సంబంధించి సోమవారం చాటింపు వేశారు. 28న గంగమ్మకు పూలపల్లకీ సేవ, 29న జాతర, 30న అమ్మవారి నిమజ్జనం జరుగుతుదన్నారు. ఈ మేరకు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

పొలాలకు వెళ్లే దారి చూపండి

- పూర్వీకుల నుండి ఉన్న కాలిబాటను, బండ్ల బాటను మూసివేసి ఇబ్బంది పెడుతున్నారు
- ఐదు సంవత్సరాలుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదు
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన సొమబట్లవారిపల్లె అగ్రహారం ప్రజలు



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న సొమబట్లవారిపల్లె ప్రజలు

రాయచోటిటౌన్, మే 26(ఆంధ్రజ్యోతి): పూర్వీకుల నుండి తమ పొలాల వద్దకు వెళ్లే కాలిబాట, బండ్ల బాటను మూసివేయడంతో సాగు చేసుకునేందుకు దారి లేక పొలాలను బీళ్లుగా మార్చుతున్నామని, తమ పొలాలకు వెళ్లే దారి చూపాలని లక్కిరెడ్డిపల్లె మండలం కుర్నూతల గ్రామం సోమబట్లవారిపల్లె అగ్రహారం ప్రజలు కోరారు. ఈ మేరకు సోమవారం వారు ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదు సంవత్సరాలుగా కాళ్లు అరిగేలా అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఎవరూ స్పందించడం లేదని వాపోయారు. ఫిర్యాదు మేరకు వివరాల్లోకి వెళితే.. రాయచోటి నియోజకవర్గ పరిధిలోని లక్కిరెడ్డిపల్లె మండలం కుర్నూతల గ్రామం సోమబట్లవారిపల్లె అగ్రహారం రైతులకు కుర్నూతల గ్రామ పొలంలోని సర్వే నెంబర్ 4, 5, 6, 13, 7, 8, 9, 10 సర్వే నెంబర్లలో సుమారు 50 ఎకరాలకుపైగా భూములు ఉన్నాయి. గ్రామానికి అర్థ కిలోమీటర్ దూరంలో ఉన్న పొలాల వద్దకు రైతులు పూర్వకాలం నుండి కాలిబాట, బండ్లబాటలో వెళ్లి పంటలు సాగు చేసుకునేవారు. అయితే ఐదు సంవత్సరాల క్రితం ఆ రైతుల పొలాలకు సమీపంలో ఉన్న వేరే రైతుల పొలాలను కుర్నూతల గ్రామం దెయ్యాలవాండ్లపల్లెకు చెందిన బాబాఫక్రుద్దీన్, మల్లి కొనుగోలు చేశారు. అంతటితో ఆగకుండా బండ్ల నాగేశ్వరి, కట్టెల నాగయ్య, నాగిరెడ్డి తదితర రైతుల పొలాలను కూడా తమకు విక్రయించాలని చెప్పడంతో అందుకు ఆ రైతులు నిరాకరించారు. దీంతో వారు పూర్వకాలం నుండి పొలాల వద్దకు వెళ్లే కాలిబాటను, బండ్లబాటను మూసివేయడంతో పొలాల వద్దకు వెళ్లేందుకు దారి లేక ఐదు సంవత్సరాలుగా సాగు లేక పొలాలన్నీ బీళ్లుగా మారాయని వారు ఫిర్యాదులో వివరించారు. ఈ విషయంపై పలుమార్లు స్థానిక రెవెన్యూ అధికారులతో పాటు 2020లో, 2022లో రెండు దఫాలు కలెక్టర్ కార్యాలయంలో కూడా ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. తమ పొలాలకు దారి చూపి బీళ్లుగా ఉన్న భూములను సాగులోకి వచ్చేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

రైతులకిచ్చిన హామీలు అమలు చేయాలి



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

రాయచోటి(కలెక్టరేట్), మే 26(ఆంధ్రజ్యోతి): రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఈశ్వరయ్య డిమాండు చేశారు. రైతు సంఘం రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా సోమవారం కలెక్టరేట్ ఎదుట రైతులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ మొదటి వారం నుండి ఖరీఫ్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో జిల్లాలో ఇంతవరకు పంటల వారీగా ప్రణాళికలు, క్రెడిట్ ప్రణాళికలు, విత్తన ప్రణాళికలు ప్రకటించలేదన్నారు. రైతులు సబ్సిడీ విత్తనాల కోసం ఎదురుచూస్తున్నారని, 90 శాతం సబ్సిడీతో విత్తనాలు, వ్యవసాయ పరికరాలు, సూక్ష్మ పోషకాలు, పచ్చిరొట్టె విత్తనాలు అందించాలన్నారు. జిల్లాలో 90శాతం కౌలు రైతులే వ్యవసాయం చేస్తున్నా ఇంతవరకు వీరికి గుర్తింపు కార్డులు జారీ చేయలేదన్నారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని ఈ ఖరీఫ్ సీజన్‌కే అందించాలని, కౌలు రైతులందరికీ ఈ పథకాన్ని వర్తింపజేయాలని, రూ.2లక్షల వరకు హామీ లేని పంట రుణాలు కౌలు రైతులకు అందించాలన్నారు. ప్రాజెక్టులు కింద ఉన్న ప్రధాన కాల్వలు, పంట కాల్వలు, పిల్ల కాల్వల్లో ఉన్న గుర్రపు డెక్క, తోడి కాడ తొలగించాలని, అక్రమాలకు పాల్పడుతున్న విత్తన కంపెనీలు, డీలర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి, సీపీఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు, వడ్లమూరి హరినాథ్ నాయుడు, బాలక్రిష్టారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

35 సెంట్లు ప్రభుత్వ, ప్రైవేటు స్థలం కబ్జా

నందలూరు, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాటూరు పంచాయతీ 953 సర్వేనంబరులోని పట్టా భూమిలో 10 సెంట్లు, ప్రభుత్వ రస్తాలోని దాదాపు 25 సెంట్ల భూమిని కొంతమంది బడా నాయకులు కబ్జా చేశారని అదే గ్రామానికి చెందిన షేక్ అన్సర్‌బాషా సోమవారం తహసీల్దారు పుల్లారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అన్సర్‌బాషా మాట్లాడుతూ 953 సర్వేనంబరు పక్కన ప్రభుత్వ రస్తా ఉందని, దాని పక్కనే 957 సర్వేనంబరులోని భూమి యజమానులు రస్తాలోని కొంత భూమిని, అలాగే తన సర్వే నంబరులోని కొంత స్థలాన్ని ఆక్రమించి అమ్మేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వేచేసి ప్రభుత్వ రస్తాను, తన స్థలాన్ని కాపాడాలని ఆయన కోరారు.

ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వైసీపీ నేతలు

రాజంపేట టౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మండలం ఊటుకూరు రెవెన్యూ పొలంలో సర్వేనంబరు 1214బి1లో ఉన్న 15 ఎకరాల ప్రభుత్వ భూమిని అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు ఆక్రమించుకున్నారని కాంగ్రెస్‌పార్టీ మాజీ అధికార ప్రతినిధి పూల భాస్కర్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఆధారాలతో సహా సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. ఈ ఆక్రమణను తొలగించి వెంకటరాజంపేట గ్రామంలో ఉన్న పేదలకు కేటాయించాలని కోరారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలో ఉన్న ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని కోరారు.

మండల ఉపాధ్యక్ష పదవికి రాజీనామా

సంబేపల్లె, మే26(ఆంధ్రజ్యోతి): సంబేపల్లె మండల పరిషత్ ఉపాధ్యక్ష పదవికి గుట్టపల్లి ఎంపీటీసీ పొత్తూరి రవీందర్‌నాయుడు రాజీనామా చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన ఎంపీడీవో రామచంద్రకు రాజీనామా పత్రాన్ని అందించారు. వ్యక్తిగత కారణాలతో ఉపాధ్యక్ష పదవికి మాత్రమే రాజీనామా చేస్తున్నామని, ఎంపీటీసీగా కొనసాగుతానని తెలిపారు.

వైభవంగా వీరభద్రుడి పల్లకీ ఉత్సవం



రాయచోటిటౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో సోమవారం పల్లకీ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు వేదమంత్రాల మధ్య వీరభద్రస్వామి, భద్రకాళీ అమ్మవార్లను వివిధ రకాల పుష్పాలు, పట్టువస్త్రాలతో అలంకరించారు. ఈ సందర్భంగా పట్టణ భక్తులతో పాటు కన్నడ భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

జిల్లా అభివృద్ధికి నిధుల మంజూరుకు కృషి చేయాలి

రాయచోటిటౌన్, మే26(ఆంధ్రజ్యోతి): జిల్లా సర్వతోముఖాభివృద్ధికి ఎన్డీఏ ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరుకు తెలుగుదేశం పార్టీ నాయకత్వం కృషి చేయాలని రాయచోటి మండల లీగల్ సర్వీసెస్ కమిటీ మాజీ సభ్యుడు యర్రపురెడ్డి విశ్వనాధరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలో శాశ్వత ప్రాతిపదికన కలెక్టర్ కార్యాలయ సముదాయ భవనాలు చేపట్టి విద్యా సంస్థల్లో ఉన్న కార్యాలయం యుద్ధ ప్రాతిపదికన మార్చాలని కోరారు. అలాగే కడప-రాయచోటి-మదనపల్లె-బెంగుళూరు రైల్వేలైన్‌కు నిధులు కోరుతూ మహానాడులో డిమాండ్ చేయాలని, హంద్రీ-నీవా ప్రాజెక్టు ద్వారా తాగు, సాగునీరు అందించేందుకు మండిపల్లి నాగిరెడ్డి (శ్రీనివాసపురం రిజర్వాయర్) ప్రాజెక్టు కాలువల నిర్మాణ పనులు పూర్తి చేయాలని, తెగిపోయిన అన్నమయ్య ప్రాజెక్టు, వై.ఆదినారాయణరెడ్డి పింఛా ప్రాజెక్టు పునరుద్ధరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. జిల్లా పరిధిలోని రాయల కాలం నాటి చెరువులు, కుంటలన్నింటికీ సంరక్షణ చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత : మంత్రి



చిన్నమండెం, మే26(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత నిస్తున్నట్లు రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన చిన్నమండెం మండలం బోరెడ్డిగారిపల్లెలోని తన నివాసంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. వివిధ శాఖల అధికారులు పేదల సమస్యలను సీరియస్‌గా తీసుకొని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

యోగాతో పరిపూర్ణ ఆరోగ్యం

- కమిషనర్ శ్రీనివాసులు

రాజంపేట టౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు ప్రతిరోజు యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా జీవించగలరని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం పట్టణంలోని ఆర్ అండ్ బీ అతిథిగృహం సమీపంలో యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జూన్ 21న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శారీరక శ్రమ ఉంటే ఎలాంటి అనారోగ్య పరిస్థితులకు గురికాకుండా ఉంటామన్నారు. అలాగే ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో సచివాలయ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందికి యోగా క్లాసులు

ఒంటిమిట్ట, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సచివాలయ సిబ్బందికి యోగా క్లాసులు నిర్వహించినట్లు ఎంపీడీవో గౌస్‌బాషా తెలిపారు. జూన్ 21న యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో యోగా క్లాసులు నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా మాస్టర్ సచివాలయ సిబ్బందితో యోగా చేయించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం

రైల్వేకోడూరు, మే 26(ఆంధ్రజ్యోతి): యోగాతో ఆరోగ్యంగా ఉండవచ్చునని ఎంపీడీవో నాగార్జునరావు తెలిపారు. సోమవారం మండల పరిషత్ ఆవరణంలో అన్ని శాఖల అధికారులకు యోగా శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు యోగా చేయాలని సూచించారు. ఈనెల 28న మదనపల్లెలో కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఐదు వేల మందితో యోగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఎమ్మెల్సీ దృష్టికి రైతు సమస్యలు

సిద్దవటం, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో అకాల వర్షం వల్ల మామిడి పంటలు పూర్తిగా దెబ్బతిని రైతులు నష్టపోయారని టీడీపీ మండల అధ్యక్షులు మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం మహానాడు ప్రాంగణంలో ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డిని కలిసి రైతు సమస్యలను వివరించారు. మామిడి రైతులను ఆదుకోవాలని, మాచుపల్లె, ఖాదర్ బంగ్లా, పెన్నానది పై వంతెన నిర్మాణం కోసం సీఎం దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్సీని కోరారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జవహర్‌బాషా, సింగిల్‌విండో మాజీ డైరెక్టర్ ఖాజాపీర్, టీడీపీ యువ నాయకులు రామచంద్రయ్య ఉన్నారు.

రైల్వేకోడూరు ఎస్ఐగా వీఎల్ ప్రసాద్‌రెడ్డి



రైల్వేకోడూరు రూరల్, మే 26(ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరు ఎస్ఐగా వీఎల్ ప్రసాద్‌రెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎస్ఐగా పని చేస్తున్న నవీన్‌బాబు చిట్వేలికి బదిలీ అయ్యారు. రాజంపేట టౌన్ ఎస్ఐగా పని చేస్తున్న ప్రసాద్‌రెడ్డి బదిలీపై కోడూరుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే చర్యలు తప్పవన్నారు. ప్రజల సహకారం తీసుకుని అసాంఘీక కార్యక్రమాలను అరికడతామని తెలిపారు.

యోగా శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

సుండుపల్లె, మే26(ఆంధ్రజ్యోతి): యోగా శిక్షణను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో అంగన్వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బందికి యోగా మాస్టర్ ట్రైనర్ రాధారాణి యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జూన్ 21న నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవో రవీంద్రనాయక్ పాల్గొన్నారు.

మహానాడును విజయవంతం చేయాలి

- టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి



రాజంపేట, మే 26 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నిర్వహించే అతిపెద్ద పండుగ మహానాడును ప్రతిఒక్కరు పాల్గొని విజయంతం చేయాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ఆయన పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ కడప వేదికగా నిర్వహించే మహానాడుకు రాష్ట్ర నలుమూలల నుంచి అతిరథ మహారథులు, అభిమానులు, కార్యకర్తలు పెద్దఎత్తున వస్తున్నారన్నారు. మూడు రోజులపాటు ఈ ఉత్సవాలను టీడీపీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందన్నారు. గత ఎన్నికల్లో కొన్ని పొరపాట్ల కారణంగా రాజంపేట అసెంబ్లీ స్థానం కోల్పోయినప్పటికీ పార్టీ పక్షాన ఉన్నామని నిరూపించాలన్నారు.

మూడు రోజులపాటు మహానాడు

సంబేపల్లె, మే 26(ఆంధ్రజ్యోతి): కడప పట్టణం చింతకొమ్మదిన్నె మండలం పబ్బాపురం గ్రామం సమీపంలో నేటి నుండి మూడు రోజుల పాటు జరిగే మహానాడు కార్యక్రమాన్ని టీడీపీ కుటుంబ సభ్యులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని మాజీ జెడ్పీటీసీ మల్లు నరసారెడ్డి తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు జన్మదినం సందర్భంగా ప్రతియేటా మే 27, 28, 29వ తేదీల్లో మహానాడు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. అందులో భాగంగానే మన కడపలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు.

కడపలో మహానాడు సంబరం

లక్కిరెడ్డిపల్లె/గాలివీడు, మే 26(ఆంధ్రజ్యోతి): కడపలో జరగబోవు మహానాడు సంబరాన్ని విజయవంతం చేయాలని పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాయచోటి నియోజకవర్గ పరిశీలకుడు డాక్టర్ కొమ్మలపాటి శ్రీధర్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విలేకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సారధ్యంలో కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. అలాగే గాలివీడు మండలంలో టీడీపీ నాయకుడు శ్రీకాంత్‌రెడ్డి స్వగృహంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. 17 గ్రామ పంచాయతీల నుంచి భారీ ఎత్తున టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో మండల యువనాయకుడు యనమల మదన్‌మోహన్, రాయచోటి టీడీపీ పరిశీలకుడు వెంగళరావు, రాజంపేట డాక్టర్ సెల్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎండీ షఫీనాయక్, రాష్ట్ర బీసీ సెల్ ఆర్గనైజేషన్ సెక్రటరీ జయరాములు, పూలుకుంట సర్పంచ్ పార్థసారధిరెడ్డి, భద్రప్పనాయుడు, మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు లక్ష్మయ్య, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రామాపురం అతిథి గృహంలో..

రామాపురం, మే26(ఆంధ్రజ్యోతి): మహానాడు కార్యక్రమంపై పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కొమ్మలపాటి శ్రీధర్, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి వెంగళరావు ఆధ్వర్యంలో స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో సోమవారం కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జన సమీకరణపై మండల నాయకులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఎం.రమేశ్‌రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి చింతపిచ్చల రామకృష్ణగౌడ్, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యులు వెంకట్రమణ, టీడీపీ నాయకులు సురేంద్రరెడ్డి, చంద్రమౌళి, చిన్నిక్రిష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

భోజన వసతి ఏర్పాట్ల పరిశీలన

రామాపురంలోని భోజన వసతి ఏర్పాట్లను సోమవారం టీడీపీ నాయకుడు డాక్టర్ లక్ష్మీప్రసాద్‌రెడ్డి, యువనాయకుడు నిశ్చల్‌నాగిరెడ్డి పరిశీలించారు. కడప పట్టణం పబ్బాపురం సమీపంలో నిర్వహించే మహానాడుకు రాయచోటి నుంచి వెళ్లే టీడీపీ నాయకులు, కార్యకర్తలకు భోజన ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు.

అవమానపడ్డ పుంగనూరు నుంచే శ్రీకాకుళం టీడీపీ కార్యకర్తల సైకిల్ యాత్ర

- విజయనగరం ఎంపీ అప్పలనాయుడు




అప్పలనాయుడును సత్కరిస్తున్న జీఎన్ నాయుడు

రాజంపేట, మే 26 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అరాచక ప్రభుత్వంలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఇలాక అయిన పుంగనూరులో తెలుగుదేశం జెండాలను పీకివేసి రోడ్లపై పారవేసి అవమానపరిచారని, అదే ప్రాంతం నుంచి సుదూర ప్రాంతమైన శ్రీకాకుళం తెలుగుదేశం కార్యకర్తలు మహానాడుకు సైకిల్‌యాత్ర ద్వారా బయలుదేరారని విజయనగరం పార్లమెంట్ సభ్యుడు అప్పలనాయుడు అన్నారు. సోమవారం పట్టణం లోని టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్ రాజు, పుంగనూరు ఇన్‌చార్జి చల్లా బాబు నేతృత్వంలో పుంగనూరు నుంచి సైకిల్‌ర్యాలీ మహానాడు వేదిక వరకు సాగుతుందన్నారు. రాజంపేటకు వచ్చిన అప్పలనాయుడును ప్రముఖ పారిశ్రామికవేత్త, రీజెన్సీ పరిశ్రమల అధినేత డాక్టర్ జీఎన్ నాయుడు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేస్‌నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్బనరసయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారన్నారు.

రుణాల ప్రణాళిక తయారు చేసుకోవాలి

రైల్వేకోడూరు, మే 26(ఆంధ్రజ్యోతి): 2025-2026 ఆర్థిక సంవత్సరానికి రుణాల ప్రణాళికను తయారు చేసుకోవాలని వెలుగు ఏపీఎం వసుంధర తెలిపారు. సోమవారం వెలుగు కార్యాలయంలో వీవోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వీవో అధ్యక్షులు రికార్డులు సక్రమంగా నిర్వహించాలన్నారు. లేదంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రుణాలు తీసుకోని గ్రూపులకు వెంటనే రుణాలు అందించే కార్యక్రమాన్ని వేగం చేయాలన్నారు. కార్యక్రమంలో వీవోలు, వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మామిడికి గిట్టుబాటు ధర కల్పించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న మామిడి రైతులు

రైల్వేకోడూరు రూరల్, మే 26(ఆంధ్రజ్యోతి): మామిడికాయలకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు డిమాండు చేశారు. ఈ మేరకు సోమవారం మైసూరివారిపల్లి పంచాయతీ వద్ద ఉన్న మార్కెట్ యార్డు వద్ద మామిడి రైతులు, వ్యాపారస్తులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు తిమ్మిశెట్టి సుబ్రహ్మణ్యం మామిడికాయలు కోత సమయంలో ఇలా ధర తగ్గించడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. అధికారులు రైతుల సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

గండి అంజన్నను దర్శించుకున్న మంత్రి అచ్చెన్నాయుడు



అంజన్నను దర్శించుకుంటున్న మంత్రి అచ్చెన్నాయుడు

చక్రాయపేట/ఒంటిమిట్ట మే 26 (ఆంధ్రజ్యోతి): గండి వీరాంజనేయ స్వామిని సోమవారం రాష్ట్ర పశుసంవర్ధక, వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు పూర్ణఫలంతో స్వాగతం పలికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి గండి ఆంజనేయస్వామి చరిత్ర, పాపాఘ్ని పవిత్రత, మకరతోరణం లాంటివి అడిగి తెలుసుకున్నారు. స్వయాన శ్రీరామ చంద్రుడు లిఖించిన శిల్పం గండి క్షేత్రంలోనే ఉందని పూజారులు తెలపడంతో ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అలాగే ఒంటిమిట్ట కోదండ రామాలయాన్ని మంత్రి అచ్చెన్నాయుడు సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వాగతం పలికి పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ చరిత్ర గురించి వివరించారు. ఆలయంలో శిల్ప సంపద అద్భుతంగా ఉందని మంత్రి కొనియాడారు. గండి దేవస్థానం, ఒంటిమిట్ట ఆలయాల అర్చకులు , టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహానాడు భోజన వసతి ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న చీఫ్ విప్ ఆంజనేయులు, బీటెక్ రవి

పులివెందుల, మే 26 (ఆంధ్రజ్యోతి): కడప మహానాడుకు వచ్చే టీడీపీ శ్రేణులకు భోజన వసతి కల్పించేందుకు చురుగ్గా సాగుతున్న ఏర్పాట్లను ప్రభుత్వ చీఫ్ విప్ ఆంజనేయులు, పులివెందుల ఇన్ చార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి)లు పరిశీలించారు. కడపకు వెళ్లే దారిలో మెడికల్ కళాశాల సమీపంలో అనంతపురం జిల్లాలోని దాదాపు 10 నుంచి 12 నియోజకవర్గాల నుంచి మహా నాడుకు వచ్చే టీడీపీ శ్రేణులకు బీటెక్ రవి భోజన ఏర్పాట్లను చేపట్టారు. అనంతపురం జిల్లా నుంచి వచ్చే టీడీపీ శ్రేణులు ఇక్కడ భోజనం చేసే అవకాశం ఉన్నందున ఈఏర్పాట్లను వీరు పరిశీలించారు.

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ కోటేశ్వరరావు

కడప మారుతీనగర్, మే 26 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న మహానాడు కార్యక్రమానికి విచ్చేసిన రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ జి.కోటేశ్వరరావు సోమవారం చిన్నచౌకు కొండాయపల్లెలో గల జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని సందర్శించారు. అక్కడ జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో పాల్గొని విద్యార్థులతో ముచ్చటించారు. గ్రంథాలయ రెఫరెన్స్ సెక్షన్‌లో డీఎస్సీ, కానిస్టేబుల్ ఉద్యోగాలకు ప్రిపేర్ అవుతున్న నిరుద్యోగ యువతతో మాట్లాడారు. పోటీ పరీక్షలకు కావాల్సిన పుస్తకాలను విద్యార్థులకు అందుబాటులో ఉంచాలని సంబంధిత కార్యదర్శికి సూచించారు. జిల్లా కేంద్ర గ్రంథాలయ నూతన భవన నిర్మాణానికి రూ.కోటి నిధులు విడుల చేశామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి అమీ రుద్దీన్, అసిస్టెంటు లైబ్రేరియన్లు తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లె పంచాయతీలో అవినీతిపై విచారణ

- ప్రాథమికంగా రూ.8లక్షల అవినీతి జరిగినట్లు నిర్ధారణ

వేంపల్లె, మే 26 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పంచాయతీలో జరిగిన అవినీతిపై పులివెందుల డీఎల్‌పీఓ భూమిరెడ్డి రమాదేవి ఆధ్వర్యంలో విచారణ సాగుతోంది. వీఎన్‌పల్లె డిప్యూటీ ఎంపీడీఓ రామ్ సింగ్, ఇతర అధికారులు ఈ విచారణ కొద్దిరోజులుగా చేస్తున్నారు. 2019 నుంచి 2022 వరకు అప్పట్లో పనిచేసిన ఈఓ, జూనియర్ అసిస్టెంట్, సిబ్బందిపై అవినీతి ఆరోపణలు రావడంతో ఈ విచారణ నిర్వహిస్తున్నారు. నీటిపన్ను, ఇంటిపన్ను, ఇంటి ప్లానింగ్ అప్రూవల్ కోసం చెల్లించిన రసీదులను ఇప్పటి వరకు పరిశీలించి విచారణ జరిపారు. ఇందులో సుమారు రూ.8లక్షల మేర అవినీతి జరిగినట్లు ప్రాథమికంగా బయటపడినట్లు అధికారుల సమాచారం. ఇక పనులు జరిగిన ఎంబుక్కులు, ఇతర రికార్డులను తనిఖీ చేయాల్సి ఉంది. ఈ విషయమై డీఎల్‌పీఓ రమాదేవి మాట్లాడుతూ విచారణ దాదాపుగా పూర్తయ్యిందని మరికొద్ది రోజుల్లో పూర్తిచేసి నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని తెలిపారు. అనంతరం ఈఓ రామసుబ్బారెడ్డి, పంచాయతీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వేంపల్లెలో పారిశుధ్యం మెరుగయ్యేందుకు, తాగునీటి సరఫరా సక్రమంగా జరిగేలా చర్యలు చేపట్టాలని డీఎల్‌పీఓ రమాదేవి సూచించారు. పంచాయతీ ప్రధాన సమస్యల గురించి చర్చించారు.

యోగా దినోత్సవంలో 10 లక్షల మంది పాల్గొనేలా కృషి

- అన్నమయ్య జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి(కలెక్టరేట్), మే 26 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్టణంలో జూన్ 21న నిర్వహించే 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం కార్యక్రమానికి జిల్లా నుంచి పది లక్షల మంది పాల్గొనేలా కృషి చేస్తున్నామని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి దేశ ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాల్గొంటారని.. రాష్ట్ర వ్యాప్తంగా రెండు కోట్ల మంది హాజరయ్యేలా ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇందులో భాగంగా మన జిల్లా నుంచి పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొనేలా ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ఈ నెల 28న జిల్లా ఇన్‌చార్జి మంత్రి, జిల్లా మంత్రి వర్యులు ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, అంగన్వాడీ హెల్పర్లు, టీచర్లు, ఆశా, హెల్త్‌వర్కర్లు, జిల్లా అధికారులు తదితరులు 5 వేల మందితో మదనపల్లి బీటీ కాలేజీ గ్రౌండ్‌లో ఉదయం 6 నుంచి 8 గంటల వరకు ఒకే చోట యోగా నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. యోగాంధ్ర లింక్, క్యూఆర్ కోడ్ ద్వారా జిల్లాలో ఇప్పటి వరు 4232 ట్రైనర్లు, 72,691 మంది ప్రజలు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, విస్తృత అవగాహన కల్పించడం ద్వారా ఎక్కువ సంఖ్యలో జిల్లా నుంచి రిజిస్టర్ చేసుకునేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. 28న నిర్వహించే యోగా కార్యక్రమంలో మీడియా వారికి కూడా ప్రత్యేకంగా గ్యాలరీ ఏర్పాటు చేస్తామని, యోగాలో పాల్గొని కార్యక్రమాన్ని విస్తృతంగా కవరేజ్ చేయాలని కలెక్టర్ కోరారు. సమావేశంలో జేసీ ఆదర్శ్ రాజేంద్రన్ పాల్గొన్నారు.

యువరైతు ఆత్మహత్య..

- పంటల సాగులో నష్టాలు రావడం..
- చేసిన అప్పులు తీర్చలేక...



రాహుల్‌రెడ్డి (ఫైల్)

పెద్దతిప్పసముద్రం, మే 26 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగం వదిలి వ్యవసాయంపై మక్కువతో స్వగ్రామానికి వచ్చి పంటలు సాగుచేసి నష్టపోయిన యువరైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పీటీఎం మండలం తుమ్మరకుంట గ్రామ పంచాయతీ బురదవాండ్లపల్లెలో జరిగింది. బురదవాండ్లపల్లెకు చెందిన గంగిరెడ్డి కుమారుడు రాహుల్ రెడ్డి (25) ఇంజనీరింగ్ పూర్తి చేసుకుని బెంగళూరులో కొన్నాళ్ల పాటు ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేశాడు. అయితే వ్యవసాయంపై ఉన్న మక్కువతో మూడు సంవత్సరాల క్రితం స్వగ్రామానికి చేరుకున్నాడు. తన దగ్గర ఉన్న పెట్టుబడితో వ్యవసాయం ప్రారంభించాడు. పెట్టిన పంటలు సక్రమంగా చేతికి అందకపోవడంతో తిరిగి పలువురి దగ్గర అప్పులు చేసి దోస, టమోట, కర్భూజ పంటలు సాగు చేశాడు. పంటలు బాగా పండినా ధరలు లేక పోవడంతో వరుసగా నష్టాలు వచ్చాయి. ఎంతో ఆశతో వ్యవసాయ రంగంలోకి దిగిన యువరైతుకు కష్టాలు కన్నీళ్లే మిగిలాయి. పంటల ద్వారా పూర్తిగా నష్టపోవడం, అప్పుల బాధ ఎక్కువ కావడంతో మనస్థాపానికి గురై ఈనెల 16న పొలం వద్దే పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కుటుంబీకులు తిరుపతిలోని స్విమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. బాగా చదువుకుని ఉద్యోగం చేస్తూ తమకు అండగా ఉంటాడనుకున్న కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు భోరున విలపించారు. యువరైతు ఆత్మహత్యతో బురదవాండ్లపల్లెలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పీటీఎం పోలీసులు తెలిపారు.

గుండెపోటుతో ఉపాధి కూలి మృతి

రామాపురం, మే 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచపల్లి పంచాయతీకి చెందిన టేకూరి రెడ్డెన్న (69) అనే ఉపాధి కూలి గుండెపోటుతో సోమవారం మృతి చెందినట్లు ఏపీవో పెంచలయ్య తెలిపారు. రోజు మాదిరే సోమవారం కూడా ఉపాధి పనికి వెళ్లి అక్కడ కాలువలో పూడికతీత పనులు చేసి తిరిగి ఇంటికి తనతో పాటు కూలీలందరూ వస్తూ ఉండగా మార్గ మధ్యంలోకి రాగానే ఒక్కసారిగా గుండె పోటు రావడంతో కిందపడి అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు.

చాక్లెట్ ఇప్పిస్తానని ఆశ చూపి.. చిన్నారులను మభ్యపెట్టిన అపరిచిత వ్యక్తి

- దేహశుద్ధి చేసిన కుటుంబసభ్యులు
- పోలీసులకు అప్పగింత

జమ్మలమడుగు, మే 26 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు నియోజకవర్గంలోని ఎ.కంబాలదిన్నె గ్రామంలో మూడేళ్ల చిన్నారిపై జరిగిన ఘటనను ప్రజలు ఇంకా మరువకముందే మరో చిన్న ఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే... జమ్మలమడుగు నుంచి కోవెలకుంట్ల వెళ్లే బైపాస్ సర్కిల్ పక్కన శివారెడ్డి కాలనీ ఉంది. అక్కడ ఆదివారం 24 ఏళ్ల ఓ వ్యక్తి అక్కడే ఉన్న ఇద్దరు 5 నుంచి 7 సంవత్సరాలు వయస్సు గల చిన్నారులకు చాక్లెట్ ఇప్పిస్తానని ఆశచూపి రోడ్డుపైకి పిలుచుకు వెళుతుండగా.. స్థానికులు గమనించి వెంటనే కుటుంబ సభ్యులకు చెప్పారు. దీంతో ఆ వ్యక్తికి అక్కడే దేహశుద్ధి చేసి అర్బన్ పోలీసు స్టేషన్‌లో పోలీసులకు అప్పగించినట్లు తెలిసింది. ఈ సందర్భంగా ఎస్ఐ రామకృష్ణ మాట్లాడుతూ తమకు రాబడిన సమాచారం మేరకు ఘటనాస్థలానికి వెళ్లి విచారించామన్నారు. చిన్నారుల తల్లిదండ్రులు చెప్పిన వివరాల మేరకు ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామన్నారు. ఇలాంటి ఘటనలు ఎక్కడా జరుగకుండా చర్యలు చేపడుతున్నామని ఎస్ఐ తెలిపారు. ఎవరైనా అపరిచిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ తెలిపారు.

బైకును ఢీకొన్న కారు.. వ్యక్తి మృతి



మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబసభ్యులు, పెద్దిరెడ్డి వెంకటరెడ్డి (ఫైల్)

పోరుమామిళ్ల, మే 26 (ఆంధ్ర జ్యోతి): మోటారుబైకును కారు ఢీకొన్న సంఘటనలో వెంకటరెడ్డి (55) అనే వ్యక్తి మృతి చెందాడు. పోరుమామిళ్ల మండలంలోని కొండుగారిపల్లెకు చెందిన పెద్దిరెడ్డి వెంకటరెడ్డి అనే కాంట్రాక్టరు సోమవారం సొంత పని నిమిత్తం మోటారు బైకులో బద్వేలు వైపు వెళుతుండగా చెన్నారెడ్డిపేట సమీపంలో కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఈవిషయం తెలియడంతో కుటుంబ సభ్యులు, బంధువులు ప్రభుత్వ ఆసుపత్రి వద్ద బోరున విలపించారు. జిల్లా పరిషత్ చైర్మన్ రామగోవిందురెడ్డి, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ రమణారెడ్డి, వైసీపీ అదనపు సమన్వయకర్త విశ్వనాథ రెడ్డి మృతుని స్వగృహానికి వెళ్లి నివాళులర్పించారు.

వ్యక్తిపై దాడి.... కేసు నమోదు

పులివెందుల, మే 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని క్రిస్టియన్ కాలనీలో గత రాత్రి ఓ వ్యక్తిపై జరిగిన దాడికి సంబంధించి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఆదివారం రాత్రి 10.30 గంటల సమయంలో పట్టణంలోని క్రిస్టియన్‌కాలనీలో కుమార్ అనే వ్యక్తిపై లక్కి, రెమో, రాజన్న, దానమయ్యలు ఇనుప కడ్డీలతో దాడి చేశారన్నారు. ఈ దాడిలో కుమార్‌కు రక్తగాయాలయ్యాయి. బాధితుడు కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కుక్కల దాడిలో పొడదుప్పి మృతి



పెనగలూరు, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగారెడ్డిపల్లె కంబాలకుంట గ్రామాల మధ్యలో ఉన్న సిద్ధిగారికుంటలో సంచరిస్తున్న పొడదుప్పిపై కుక్కలు దాడి చేసి చంపివేశాయి. చిట్వేలి ఫారెస్ట్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో ఎఫ్ఎస్‌వోలు సావిత్రి, ఎఫ్‌బీవోలు కేవీ సుబ్బయ్య, సుబ్బరాయుడు సంఘటన స్థలానికి చేరుకుని దుప్పి కాకర్లవారిపల్లె వెటర్నరి ఆసుపత్రికి తరలించారు. వెటర్నరీ డాక్టర్ వేదవతి పొడదుప్పికి పోస్టుమార్టం నిర్వహించారు. కాగా, ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నన ఎక్కడా తాగునీటికి కొరతలేదని, కంపచెట్లలో రాలిపోయిన కాయలను తినేందుకు వచ్చి కుక్కల దాడిలో మృతి చెందిందని అటవీశాఖ సిబ్బంది తెలిపారు.

పిచ్చికుక్క స్వైర విహారం.. 50 మందిపై దాడి

బద్వేలుటౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి) : బద్వేలులో ఓ పిచ్చికుక్క స్వైరవిహారం చేస్తూ మున్సిపాలిటీలో ప్రజలు భయభ్రాంతులకు గురిచేసింది. సోమవారం పట్టణంలోని సిద్దవటంరోడ్డు మొదలుకొని ఆర్టీసీ బస్టాండు, నాలుగురోడ్ల కూడలి, పోరుమామిళ్లరోడ్డు, అబ్బరాతివీధి, దూదేకుల వీధి, భావనారాయణనగర్, కుమ్మరికొట్టాల, ఆంజనేయనగర్, కూరగాయల మార్కెట్ తదితర ప్రాంతాల్లో పిచ్చికుక్క స్వైరవిహారం చేస్తూ, చిన్నా, పెద్ద, ముసలి, ముతక అనే తేడాలేకుండా 50 మందిపై దాడి చేసింది. దూదేకుల వీధిలోని సుభాన్‌బీ, ఆర్టీసీ బస్టాండు వద్ద బస్సుకోసం ఎదురుచూస్తున్న మహాలక్ష్మమ్మ, గాండ్లవీధికి చెందిన రామయ్య, వీరారెడ్డి కాలేజీవద్ద కేవీ సుబ్బారెడ్డి, గుంతపల్లె క్రాస్ వద్ద వీరయ్య, గాంధీనగర్‌కు చెందిన శ్రీను, కూరగాయల మార్కెట్ వద్ద లక్ష్మీపాలెంకు చెందిన సుబ్బమ్మ, కోటి రెడ్డినగర్‌కు చెందిన చంద్రశేఖర్, మోక్షిత్‌రామ్, బాలాజీ, శ్రీనివాసులులు తీవ్రంగా గాయపడ్డారు. కాళ్లు, చేతులు, మెడ, చెవులు, వీపు, పిక్కలపై విచక్షణా రహితంగా దాడిచేసింది. దీంతో మున్సిపల్ అధికారులు అప్రమత్తమై పట్టణాన్ని జల్లెడపట్టి అతి కష్టంమీద పిచ్చికుక్కను బంధించి చంపేశారు. ఒకే రోజు ఇంత మందిపై దాడి చేయడంతో ప్రజలంతా ప్రభుత్వాసుపత్రికి పరుగులు పెట్టారు. దీంతో ప్రభుత్వాసుపత్రిలో పిచ్చికుక్కదాడిలో గాయపడిన బాధితులతో ఆసుపత్రి అంతా కిక్కిరిసిపోయింది. తొలుత ఆసుపత్రిలో సిబ్బంది తక్కువగా ఉండటంతో బాధితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విషయం తెలుసుకున్న సూపరింటెండెంట్ సుబ్బారెడ్డి వెంటనే సిబ్బందిని అప్రమత్తంచేసి గాయపడిన వారికి చికిత్స చేశారు. ఇటీవల కాలంలో బద్వేలు మున్సిపాలిటీలో కుక్కలు అనేక మందిపై దాడిచేసి కరుస్తున్నప్పటికీ మున్సిపల్ సిబ్బంది పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

విద్యుదాఘాతంతో తాపీ మేస్త్రీ మృతి

పీలేరు, మే 26 (ఆంధ్ర జ్యోతి): విద్యుదాఘాతంతో తాపీ మేస్త్రీ మృతి చెందాడు. పీలేరు పట్టణం తిలక్ వీధి లో కాపురముంటున్న అప్స ర్‌పాషా(40) తాపీ మేస్త్రీగా పని చేస్తుండేవాడు. సోమ వారం ఉదయం ఏపీఐఐ సీ-3 లేఔట్ లోని ఓ ఇంటి నిర్మాణ పనులకు వెళ్లాడు. అక్కడ పనిచేస్తుండగా విద్యుత్ తీగలు తగలడంతో షాక్‌కు గురయ్యాడు. ఈవిషయాన్ని గమనించిన ఇంటి యజమాని, సహచర కూలీలు అతన్ని హుటాహుటిన పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెంది నట్లు వైద్యులు తేల్చారు. అప్సర్ పాషాకు భార్య అప్సా ఫాతిమా, ముసాద్(10), ఖతీజా(8) అనే ఇద్దరు పిల్లలు న్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడు దుర్మరణం


పెద్దతిప్పసముద్రం, మే 26 (ఆంధ్రజ్యోతి): ఓ లారీ అతి వేగంతో రావ డంతో ఓ బాలుడు అక్క డికక్కడే మృతి చెందిన విషాదకర సంఘటన మండలంలోని వరికసువపల్లెలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేర కు... తుమ్మర కుంట పం చాయతీ వరికసువప ల్లెకు చెందిన సుధాకర్ రెడ్డి కుమారుడు పురిసిత్ రెడ్డి (14) మెయిన్ రోడ్డు మీద ఆడు కుంటుండగా ఓ కెమికల్ లారీ బి.కొత్తకోట వైపు నుంచి కర్ణాటక రాష్ట్రం చెలూరు వైపు వెళ్లేందుకు అతి వేగంగా వెళుతూ బాలుడిని ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

ముగ్గురు మహిళా వైద్యుల బదిలీ

కలికిరి, మే 26 (ఆంధ్రజ్యోతి): కడప, అన్నమయ్య జిల్లాల్లో ముగ్గురు మహి ళా వైద్యులను బదిలీ చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసిం ది. కడప ప్రభుత్వ వైద్య కళాశాలలో అనటమీ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ సి.యామినీ దేవిని తిరుపతి ఎస్వీ వైద్య కళాశాలకు బదిలీ చేసింది. భార్యా, భర్తల కారణంతో ఖాళీగా వున్న పోస్టులోకి ఆమెను నియమించింది. అదే విధంగా వేంపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సివిల్ అసిస్టెంట్ సర్జన్ హోదాలో పనిచేస్తున్న డాక్టర్ యు.బి. లక్ష్మీప్రియను అదే హోదాతో తిరుపతి గొల్లపల్లె పీహెచ్‌సీకి బదిలీ చేశారు. ఈ బదిలీ కూడా భార్యా, భర్తల కారణంతోనే జరిగింది. ఇక అన్నమయ్య జిల్లా గాలివీడు సీహెచ్‌సీలో పని చేస్తున్న డాక్టర్ కె.రాధామాధవిని ఖాళీగా వున్న ఇదే జిల్లాలోని పీలేరు మండలం రేగళ్ళు పీహెచ్‌సీకి బదిలీ చేశారు. రాష్ట్ర ఆరోగ్య, వైద్య, కుటుంబం సంక్షేమ శాఖ కార్యదర్శి డాక్టర్ మంజులా డి.హోస్మణి సోమవారం వేర్వేరుగా మూడు బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు.

చట్టసభల్లో రిజర్వేషన్లు సాధించడమే లక్ష్యం

- రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య



మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

ప్రొద్దుటూరుటౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి): చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు సాధించడమే తమ లక్ష్యమని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు ఆర్.కృష్ణయ్య పేర్కొన్నారు. సోమవారం ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బీసీల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీతోనే రిజర్వేషన్ల కల సాకారం అవుతుందన్నారు. మిలిటెంట్ తరహా పోరాటాలతోనే అనేక బీసీ సంక్షేమ పథకాలను సాధించామని, దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఏపీ, తెలంగాణాలో బీసీల కోసం ఉద్యమించామని తెలిపారు. అందువలన ఆ రెండు రాష్ట్రాల్లో బీసీలకు సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని పేర్కొన్నారు. కాగా గతంలో ఏ ప్రభుత్వం కులగణన చేయడానికి ముందుకు రాలేదని, 96 ఏళ్ల తర్వాత ప్రధాని మోదీని కులగణన చేయడానికి ఒప్పించామన్నారు. అనంతరం జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు నూకాలమ్మలు మాట్లాడుతూ బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ, జనాభా దామాషా ప్రకారం బీసీలకు ప్రత్యేక బడ్జెట్, బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు, మహిళా రిజర్వేషన్లలో బీసీలకు ప్రత్యేక కోటా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్.కృష్ణయ్యను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, బీసీ సమాఖ్య అధ్యక్షుడు డాక్టర్ సోమా లక్ష్మీనరసయ్య, సహ అధ్యక్షుడు సందు శివనారాయణ, రాష్ట్ర సెక్రటరీ జనరల్ డీవీ రాజు, జిల్లా అధ్యక్షుడు జింకా జయప్రకాశ్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీదేవి, శివనారాయణయాదవ్, గురుమూర్తి, బాలకృష్ణయాదవ్, సువాంతి, రాష్ట్ర కార్యదర్శి రెడ్డయ్య, విజయకుమార్, సాధు గోపాల కృష్ణ, ప్రభుకుమార్, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు నారా లోకేశ్ పలకరింత


కార్యకర్తలకు అభివాదం చేస్తున్న మంత్రి నారా లోకేశ్

కలకడ, మే 26(ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకులు, కార్యకార్తలను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సోమవారం రాత్రి పలకరించారు. కడప జిల్లాలో జరిగే మహానాడుకు వెళుతూ మార్గమధ్యంలోని కలకడలో ఆయన కాసేపు ఆగి కార్యకర్తలతో ముచ్చటించారు. దీంతో ఈ పార్టీ శ్రేణులు సంతోషాన్ని వ్యక్తం చేశాయి.

వైభవంగా సత్యమ్మ జాతర

● కనుల పండువగా నగరోత్సవం.. ఊంజల్‌సేవ


జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి

వాల్మీకిపురం, మే 26(ఆంధ్రజ్యోతి): సత్యమ్మ జాతరలో భాగంగా మండలంలోని గండబోయనపల్లె కోటలో సోమవారం నిర్వహించిన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మహిళలు దివిటీలు, మంగళ వాయిద్యాల నడుమ దీలు, బోనాలతో ఆలయానికి చేరుకుని అమ్మవారికి సమర్పించారు. ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఊంజల్‌సేవ అనంతరం పుష్పపల్లకిలో గ్రామోత్సవం నిర్వహించారు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ పులి సత్యనారాయణరెడ్డి, సభ్యులు చక్రపాణి, అర్చకులు ఉత్తన్నస్వామి, విశేష సంఖ్యలో మహిళలు, యువత పాల్గొన్నారు.

ఉప్పులూరివాండ్ల పల్లెలో దిగువ గిండి గంగమ్మ జాతర

తంబళ్లపల్లె, మే 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పులూరివాండ్లపల్లెకు సమీపంలో వెలసిన దిగువ గిండి గంగమ్మ జాతరను గ్రామస్తులు ఆది, సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని రంగురంగుల విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. ఆలయ పూజారి గిండి భాస్కర్ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి దీలూ, బోనాలూ సమర్పించారు. ఆదివారం రాత్రి చాందిని బండ్లు కట్టి ఆలయం చుట్టూరా తిప్పి మొక్కులు తీర్చుకున్నారు.

40శాతం సబ్సిడీతో వేరుశనగ విత్తనకాయలు పంపిణీ

నిమ్మనపల్లి, మే 26(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో రైతులకు వేరుశనగ విత్తనకాయలు 40 శాతం రాయితీతో పంపిణీ చేయనున్నట్లు ఏవో మురళీ మోహన్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండలానికి 1100 వందల క్వింటాళ్ల విత్తనకాయలు వచ్చినట్లు తెలిపారు. వాటిలో కే సిక్స్ రకం(తెలుపు) 300 వందల క్వింటాళ్ళ, నారాయణి రకం (ఎరుపు) 800 వందల క్వింటాళ్లు వచ్చినట్లు తెలిపారు. వీటిని ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు త్వరలోనే పంపిణీ చేయనున్నట్లు వివరించారు.

పిడుగుపాటుకు మృతి చెందిన ఆవుకు పరిహారం చెల్లింపు

కలికిరి, మే 26 (ఆంధ్రజ్యోతి): పిడుగుపాటు కారణంగా మరణించిన పాడి ఆవుకు పరిహారం విడుదల చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. వాల్మీకిపురం మండలం మంచూరు గ్రామంలోని రైతు పి.లక్ష్మీనారాయణకు చెందిన పాడి ఆవు 2023 నవంబరు 6న పిడుగుపాటుతో మరణించింది. అయితే ప్రభుత్వం నుంచి బాధిత రైతుకు ఎలాంటి సాయం అందలేదు. ఈ విషయం స్థానిక శాసన సభ్యుడు నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి దృష్టికి వెళ్లడంతో ఆయన చొరవ తీసుకున్నారు. 2024 సెప్టెంబరు 26న కలెక్టరు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో పిడుగుపాటుకు సంబంధించిన విపత్తులకు నిధులు అందుబాటులోకి రావడంతో రూ.37,500 పరిహారం విడుదల చేస్తూ రెవెన్యూ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మి సోమవారం ఆదేశాలు జారీ చేశారు.

కూటమి ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికి సముచిత స్థానం

వాల్మీకిపురం, మే 26(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో కష్టపడిన నాయకులు, కార్యకర్తలందరికీ సముచిత స్థానం కల్పిస్తున్నట్లు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి తెలిపారు. సోమవారం వాల్మీకిపురం మార్కెట్ కార్యాలయంలో నూతన కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జూన్ 4 న నూతన కమిటీ ప్రమాణ స్వీకారం ఉంటుందని, ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, నల్లారి అభిమానులు తప్పక హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నూతన చైర్మన్ చంద్రమౌళి, నాయకులు కృష్ణారెడ్డి, కమిటీ డైరెక్టర్లు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

29న మహాహోమం

లక్కిరెడ్డిపల్లె, మే 26(ఆంధ్రజ్యోతి): ఈ నెల 29న మాతంగ మహాపీఠం ఆధ్వర్యంలో మహాహోమం నిర్వహిస్తున్నట్లు పీఠాధిపతి మాతంగ గిరి మహాస్వామి తెలిపారు. గురువారం మహాపీఠం శిలాశాసనంతో ప్రారంభిస్తారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో హిందూ ధర్మ నాయకులు డాక్టర్ సుబ్బారెడ్డి, గంగి రెడ్డి, రామచంద్రారెడ్డి, గురుస్వామి, రమణ, నల్లగొల్ల గంగాధర్, కృష్ణ పాల్గొన్నారు.

ధరాపాతం!

● కూలి కూడా గిట్టుబాటు కాలేదు.. ● టమోటా, దోస సాగులో తీవ్ర నష్టాలు ● పొలాల్లోనే కాయలు వదిలేసిన రైతులు


టమోటా పంట వదిలేసిన సర్పంచ్ బయ్యారెడ్డి

పెద్దమండ్యం, మే 26(ఆంధ్రజ్యోతి): ఆశించిన దిగుబడులు సాధించినా, గిట్టుబాటు ధరలు లభించకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పంట ఉత్పత్తులకు మార్కెట్‌లో లభిస్తున్న ధర కోత కూళ్లకు కూడా చాలకపోవడంతో పంటను పొలాల్లోనే వదిలేస్తున్నారు. లక్షలు పెట్టుబడులు పెట్టగా 30 శాతం కూడా చేతికి రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ ఏడాది వేసవిలో పెద్దమండ్యం మండలంలో సుమారు 430 మంది రైతులు 800 ఎకరాల్లో టమోటా సాగు చేశారు. ఒక ఎకరాలో సాగు కోసం ఒక్కో రైతు రూ. 1.50 వేలు పెట్టుబడి పెట్టామని, దిగుబడులు వచ్చేసరికి ధర అమాంతంగా పడిపోవడంతో ఒక్క కోత కూడా చేయకుండా పొలంలోనే వదిలేశామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం 30 కిలోల టమోటా క్రేట్ కేవలం రూ.90 నుంచి రూ.150 లోపే ఉన్నట్లు రైతులు వాపోయారు. ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు టమోటా కోతలకు ఒక్కో కూలీకి రూ. 300, రవాణా ఖర్చులు, మార్కెట్‌లో కమీషన్‌లు పోను తీవ్ర నష్టం వస్తోందని అంటున్నారు. కొన్ని నెలలుగా ఈ పరిస్థితి కొనసాగుతోందని రైతులు చెబుతున్నారు. మరో పక్క దోస, కర్బూజా పంట లకు కనీస ధరలు లేక పోవడంతో వ్యవసాయం కష్టంగా మారిం ది. మండలంలోని బండ్రేవు గ్రామ సమీపంలో ఓ రైతు రూ.5 లక్షలు పెట్టుబడి పెట్టి నాలుగు ఎకరాల్లో దోస పంట సాగు చేశాడు. ఆశించిన స్థాయిలో దిగుబడి వచ్చినా కిలో కనీసం రూ. 10 కూడా పలకక పోవడంతో పొలంలోనే వదిలేశాడు. ఈ సారి పెట్టుబడిలో కనీసం రూ. 50 వేలు కూడా రాలేదని ఆ రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. టమోటా, దోస వంటి ఉత్తత్తుల ఎగుమతులు లేకపోవడం ధరలు పడిపోవడానికి ఒక కారణమని రైతులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకొని తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఫలితం దక్కలేదు

ఈ ఏడాది టమోటా సాగులో కష్టానికి ఫలితం దక్కలేదు. ఒక టిన్నర ఎకరాలో టమోటా సాగు చేశారు. సాగు కోసం పెట్టుబడి రూ. 3 లక్షలు ఖర్చు పెట్టాను. అధిక దిగుబడి వచ్చినా, గిట్టుబాటు ధర లేకపోవడంతో ఒక సారి కూడా కోయలేదు. పంట ను పొలంలోనే వదిలేశా..

\- బయ్యారెడ్డి, బండమీదపల్లి

నష్టాలపాలు చేసిన టమోటా

ఈ సారి టమోటా పంట నష్టాల పాలు చేసింది. ఎకరా పొలంలో టమోటా సాగు చేశాను. నష్టం రావడంతో పంటను దున్నేశాను. టమాటా సాగులో ఎకరాకు ఒకటిన్నర లక్షలు చొప్పున ప్రతి రైతు నష్టపోయాడు. కనీసం ధర రూ. 15 నిర్ధారించాలి.

\- మహబూబ్‌బాషా, పెద్దమండ్యం

కడపలో పసుపు పండగకు తరలిరండి

● నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి


మాట్లాడుతున్న ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి, పక్కన పరిశీలకులు శ్రీనివాసులురెడ్డి, గురువారెడ్డి

ములకలచెరువు, మే 26(ఆంధ్రజ్యోతి): కడపలో జరిగే పసుపు పండగకు తరలిరావాలని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి, పరిశీలకులు శ్రీనివాసులురెడ్డి, గురువారెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మహానాడుకు తంబళ్లపల్లె నియోజకవర్గం నుంచి 20 వేల మంది హాజరయ్యేలా చర్యలు తీసుకున్నామన్నారు. ప్రతి గ్రామం నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై తంబళ్లపల్లె సత్తా చాటుతామన్నారు. జగన్‌రెడ్డి ఇలాకాలో మహానాడు అన్నప్పటి నుంచి వైసీపీలో వణుకు మొదలైందన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గ పరిశీలకుడు సీడు మల్లికార్జుననాయుడు, టీడీపీ జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేవీ రమణ, నాయకులు ఆదిమూర్తి, శ్రీనివాసులు, రెడ్డెప్ప, గణేష్, మస్తాన్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బి.కొత్తకోట: ఉప్పెనలా తరలి వచ్చి మహానాడును విజయవంతం చేయాలని బి.కొత్తకోట మండల టీడీపీ నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మండల టీడీపీ అధ్యక్షుడు నారాయణస్వామిరెడ్డి అధ్యక్షతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప సమీపంలో మంగళవారం నిర్వహిస్తున్న మహానాడుకు పెద్ద ఎత్తున కార్యకర్తలు తరలివెళ్లాలని తీర్మానించారు. మహానాడు వేడుక రాయలసీమ జిల్లాలలో నిర్వహించడం ఒక అదృష్టం అని, ప్రజలందరూ ఈ వేడుకలో పాల్గొని విజయవంతం చేయాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ నారాయణస్వామిరెడ్డి, నియోజకవర్గ పోల్ మేనేజ్మెంట్ కోఆర్డినేటర్ కుడుం శ్రీనివాసులు, నాయకులు కనకంటిప్రసాద్, బంగారువెంకట్రమణ, దేవరింటి కుమార్, సమీవుల్లా, శరత్, శిల్పాఅంజి, సుకుమార్, చాకనారాజా. ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు

సైకిల్ యాత్రికులకు సన్మానం


మహానాడుకు సైకిల్‌యాత్ర చేస్తున్న టీడీపీ కార్యకర్తలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లెటౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి): కడప మహానాడుకు శ్రీకాకుళం నుంచి సైకిల్‌పై వస్తున్న ఆరుగురు టీడీపీ కార్యకర్తలను మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఘనంగా సన్మానించారు. సోమవారం పుంగనూరు మీదుగా సైకిల్‌పై మదనపల్లెకు చేరుకున్న టీడీపీ కార్యకర్తలను ఎమ్మెల్యే తన నివాసం వద్ద సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు అరెస్టు సందర్భంగా శ్రీకాకుళం నుంచి కుప్పంకు సైకిల్‌యాత్ర చేస్తున్న ఆరుగురు కార్యకర్తలను పుంగనూరు వద్ద వైసీపీ గూండాలు అటకాయించి అవమానించారని, ఇప్పుడు అదే పుంగనూరు మీదుగా ఆరుగురు కార్యకర్తలు సైకిల్ యాత్ర చేశారన్నారు. అనంతరం సైకిల్ యాత్రికులు రామకృష్ణారెడ్డి, ఆదినారాయణ, పెంచాయరెడ్డి, సూరి రెడ్డి, రమేష్, సుందర్‌రావుకు శాలువా కప్పి సన్మానించారు. జంగాల రమణ, రెడ్డిప్రసాద్, బాలుస్వామి, పణికర్‌రెడ్డి, సహదేవ, జేసీబీ వేణు తదితరులు పాల్గొన్నారు.

ఫ్రీ హోల్డ్ నుంచి భూములను తప్పించండి

● సబ్‌కలెక్టర్‌కు రైతు వినతి

● పీజీఆర్ఎస్‌కు వెల్లువెత్తిన ఫిర్యాదులు


ప్రజల అర్జీలు పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె టౌన్, మే 26(ఆంధ్రజ్యోతి): మదనపల్లె సబ్‌కలెక్టర్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు పెద్దసంఖ్యలో ప్రజలు అర్జీలు సమర్పించారు. . కురబలకోట మండలం తుంగావారిపల్లెకు చెందిన రైతు వెంకటరమణ తాను కొనుగోలు చేసిన భూమిని ఫ్రీహోల్డ్‌లో ఉంచారని, కుమార్తె పెళ్లికి రూ.25 లక్షలు అప్పులు చేశానని, తన భూమిని ఫ్రీహోల్డ్ నుంచి తొలగిస్తే విక్రయించి అప్పులు తీర్చుకుంటామని ఆవేదన వ్యక్తం చేశాడు. తమకు ప్రభుత్వం కేటాయించిన ఇంటి స్థలానికి దారిలేకుండా రాజకీయ నాయకులు అడ్డుపెడుతున్నారని, వేంపల్లె క్రాస్‌కు చెందిన అరుణ సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వీటితో పాటు వ్యవసాయ భూముల మ్యుటేషన్లు, భూముల సర్వే పనులు, రేషన్‌కార్డుల మంజూరులో జాప్యం తదితర అంశాలపై మొత్తం 82 మంది సబ్‌కలెక్టర్‌కు అర్జీలు అందజేశారు. వీటిని ఆయా మండలాల అధికారులకు పంపి నిర్దేశిత సమయంలో ప్రజా సమస్యలు పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ ఆదేశించారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు

పీలేరు రూరల్: సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదని పీలేరు ఎంపీడీవో శివశంకర్ తెలిపారు. సోమవారం పీలేరు మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి స్వీకరించే అర్జీలను నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని, లేదంటే సంబంధిత అధికారి, సచివాలయ సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం, అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఎప్పటి కప్పుడు సచివాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ప్రధానంగా తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో పచ్చదనం, పరిశుభ్రతపై ప్రత్యేక చొరవ చూపాలని, పారిశుధ్యం కొరవడితే ప్రజలు అంటురోగాల బారిన పడే ప్రమాదం ఉంటుందన్నారు. పట్టణంతోపాటు గ్రామీణ ప్రాంతాలలో ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరించడంతోపాటు పారిశుధ్య కార్యక్రమాలపై శ్రద్ధ చూపాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అర్హులైన నిరుపేదలకు అందేలా సచివాలయ సిబ్బంది కృషి చేయాలన్నారు. పంచాయతీలలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుపై నిత్యం పర్యవేక్షణ ఉండాలని సూచించారు. ప్రభుత్వం అడిగే ప్రతి సమాచారం సకాలంలో ఆన్‌లైన్ చేయించాలని తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఎంపీడీవో లతీఫ్‌ఖాన్, పంచాయతీ కార్యదర్శులు, సిచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

‘యోగాంధ్ర’ను జయప్రదం చేయండి


ములకలచెరువులో యోగాపై శిక్షణ ఇస్తున్న దృశ్యం

పీలేరు రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి): నిత్య జీవితంలో యోగా ఒక భాగం కావాలని యోగా థెరపిస్ట్, షీ దివ్య యోగా సంస్థ అధినేత్రి డాక్టర్ పీవీఎస్. లక్ష్మి తెలిపారు. సోమవారం పీలేరు సీఎల్ఆర్సీ కార్యాలయంలో యోగాంధ్ర కార్యక్రమంపై అంగన్‌వాడీ, ఐసీడీఎస్, మెడికల్ సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. యోగాసనాలతో స్వల్ప, దీర్ఘకాలిక వ్యాధులు నయం అవుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శివశంకర్, ఐసీడీఎస్ సీడీపీవో రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లె : జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 21 వరకు జరిగే యోగా శిక్షణ కార్యక్ర మాన్ని జయప్రదం చేయాలని మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల పిలుపునిచ్చారు. స్థానిక మెప్మా కార్యాలయంలో సోమవారం స్వ యంసహాయక సంఘాలు, డీలర్లు, ఆర్పీలతో సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బుధవారం స్థానిక బీటీ కళాశాల మైదానంలో జరిగే జిల్లా స్థాయి యోగాంధ్ర ను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, సీఎంఎం మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

ములకలచెరువు : స్థానిక ఇండోర్ స్టేడియంలో సోమవారం ఉదయం యోగాపై శిక్షణ ఇచ్చారు.ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, ఎంపీడీవో హరినారాయణ తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లె అర్బన్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని మదనపల్లె తహసీల్దార్ ధనంజయులు పిలుపు నిచ్చారు. సోమవారం నిర్వహించిన రెవెన్యూ అధికారుల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలతో యోగా చేయించాలని సూచించారు. పోటీలు నిర్వహించి వారికి బహుమతులను అందివ్వాలని అన్నారు. పీజీఆర్ఎస్ లోవచ్చే అర్జీలను త్వరితగతిన పరిశీలించి మన పరిధిలో చేయగలిగితే చేయాలని లేని పక్షంలో వారికి ఎండార్స్‌మెంట్ ఇచ్చి వారితో కలిసి ఫోటో దిగి అప్‌లోడు చేయాలని తెలిపారు.

తల్లిదండ్రులను విస్మరిస్తే చట్టప్రకారం చర్యలు


సీనియర్ సిటిజన్ కోర్టులో సబ్‌కలెక్టర్‌కు గోడు విన్నవించుకుంటున్న వృద్ధుడు మల్‌రెడ్డి

మదనపల్లె టౌన్, మే 26(ఆంధ్రజ్యోతి): వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను విస్మరించిన బిడ్డలపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ హెచ్చరించారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టరేట్ కోర్టు హాలులో సీనియర్ సిటిజెన్స్ కోర్టు నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ చట్ట ప్రకారం వృద్ధాప్యంలో వున్న తల్లిదండ్రుల బాగోగులను వారి బిడ్డలే చూసుకోవాలన్నారు.అలా కాకుండా వారి ఆస్తిని కాజేసి, బాగోగులు చూడకుంటే చట్టప్రకారం రూ.10వేల వరకు మెయింటెనెన్స్‌తో పాటు, గిఫ్ట్ కింద కాజేసిన ఆస్తుల రిజిస్ట్రేషన్ రద్దు చేసే అవకాశముంటుందన్నారు. అనంతరం మూడు సీనియర్ సిటిజెన్స్ కేసులను విచారించారు. నిమ్మనపల్లె మండలం ఎర్రంవారిపల్లెకు చెందిన మల్‌రెడ్డి(84) నుంచి ఆయన కుమారుడు ఆనందరెడ్డి ఆస్తులు గిఫ్ట్ కింద రాయించుకుని, తండ్రి బాగోగులు చూడకుండా వదిలేశాడని బాధితుడు సబ్‌కలెక్టర్‌కు విన్నవించారు. తనకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారని, వారి ఇళ్లలో తలదాచుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై నోటీసులు జారీ చేసి ఇరు వర్గాలను విచారించి న్యాయం చేస్తామని సబ్‌కలెక్టర్ తెలిపారు.

‘స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా పనిచేయాలి’


సభ్యత్వ నమోదు కిట్లు పంపిణీ చేస్తున్న మహేష్

మదనపల్లె, మే 26(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా పనిచేయా లని జనసేన పార్టీ రాష్ట్ర సంయుక్త కా ర్యదర్శి మైఫోర్సు మహేష్ కార్యకర్తలకు సూచించారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో సోమవారం జనసైనికులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలోపార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసి, స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించాలని పిలుపు నిచ్చారు. ఈ మేరకు పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పంపిన సందేశాన్ని కార్యకర్తలకు చదివి వినిపించారు. అనంతరం కార్యకర్తలకు క్రియాశీలక సభ్యత్వ నమోదు కిట్లను పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇంటింటికీ తీసు కెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా లీగల్‌సెల్ ప్రెసిడెంట్ అమర్ నారాయణ, జనసేన వీర మహిళలు శోభాసునీత, భవ్య, మాలతి, రామ్మూర్తి, అంజనేయులు, సందీప్‌రెడ్డి, అప్సర్‌బాషా, మనోజ్, నరేష్, దేవేంద్ర, హేమంత్, రతీష్ పాల్గొన్నారు.

రైల్వే గేటు మార్పు కోసం స్థల పరిశీలన


స్థల పరిశీలన చేస్తున్న రైల్వే అధికారులు, కాంట్రాక్టు సంస్థ సిబ్బంది

పీలేరు, మే 26 (ఆంధ్రజ్యోతి): ఆర్వోబీ నిర్మాణంలో భాగంగా రైల్వే గేటు మార్పు కోసం సోమవారం రైల్వే అధికారులు స్థల పరిశీలన చేశారు. ట్రాఫిక్ కోసం రైల్వేగేటును ప్రస్తుతం ఉన్న స్థలం నుంచి పక్కకు మార్చాల్సి రావడంతో దాని సాధ్యాసాధ్యాలపై అధికారులు క్షేత్ర పరిశీలన చేశారు. రైల్వేగేటుకు అనుసంధానంగా ఉన్న సిగ్నల్స్, వాటి కేబుల్స్, విద్యుత్ లైన్లను వారు తనిఖీ చేశారు. తమ పరిశీలన సారాంశాన్ని నివేదిక రూపంలో ఉన్నతాధికారులకు అంద జేస్తామని మదనపల్లె, పాకాల నుంచి వచ్చిన రైల్వే అధికారులు తెలిపారు. ఆర్వోబీ కాంట్రాక్టు సంస్థ మేనేజర్ నరేశ్ చౌదరి, లైజనింగ్ అధికారి కృష్ణప్రసాద్‌లు వారి వెంట ఉన్నారు.

‘తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి’



సబ్‌కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

మదనపల్లె టౌన్, మే 26(ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు పరిశ్రమలో తొలగించిన కాంట్రాక్టు కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి టి.కృష్ణప్ప డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టరేట్ ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమలో ఇప్పటి వరకు 2,500 మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించారన్నారు. వర్క్ టెండర్లు రెన్యువల్ చేయకుండా మరో 1500 మందిని తొలగించారని, 1200 మంది కార్మికులను వీఆర్ఎస్ పేరిట తొలగించారన్నారు. ఉద్యోగాల రక్షణ కోసం 12వేల మంది కార్మికులు సమ్మె చేయాల్సి వచ్చిందని గుర్తుచేశారు. వచ్చే నెల విశాఖపట్నం వస్తున్న పీఎం నరేంద్రమోడీ విశాఖ ఉక్కు కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు మస్తాన్, చలపతి, ఏఐటీయూసీ నాయకులు ముబారక్, తిరుమల, దేవా, వాసు, సంజీవా, రాధ, జానకి, తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో దోమల నివారణ మందు పిచికారీ


వసతి గృహాల్లో దోమల నివారణకు మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది

మదనపల్లె అర్బన్, మే26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పది వసతి గృహాల్లో దోమల నివారణ కోసం ఏసీఎం 5 శాతం ద్రావణం పిచికారీ చేసినట్లు సబ్ యూనిట్ అధికారి ఖలీలుల్లా ఖాన్ తెలిపారు. పట్టణంలోని చంద్రాకాలనీ, మాయాబజార్, నీరుగుట్టవారిపల్లె, ఎస్వీఆర్ వీధిలో-2, మోతీనగర్‌లోని 5 వసతి గృహాల్లో దోమల నివారణ కోసం మందును పిచికారీ చేశామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్, సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ హెల్త్ సెక్రటరీలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై ప్రణాళిక తయారు చేసుకోవాలి



ర్యాలీలో పాల్గొన్న వీవో గ్రూపు సభ్యులు

నిమ్మనపల్లి, మే 26(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో ప్రకృతి వ్యవసాయంపై ప్రణాళిక తయారు చేసుకోవాలని అగ్రహారం సర్పంచ్ ఉషారాణి తెలిపారు. సోమవారం చెరువుమందరపల్లిలో క్యాప్ ఆధ్వర్యంలో నవోదయ వీవో గ్రూపు సభ్యులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేసే రైతులు ఖరీఫ్ సీజన్‌లో ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు.అనంతరం ప్రకృతి వ్యవసాయం చేసే రైతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎల్1 సుశీలమ్మ, మోడల్‌మేకర్ పద్మావతి, ఐసీఆర్ఎఫ్ ధనలక్ష్మి, సంఘమిత్రలు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయాలు నివారించండి


ఫీడర్లను పరిశీలిస్తున్న ఏడీఈ గోవిందరెడ్డి

తంబళ్లపల్లె, మే 26 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సర ఫరాలో అంతరాయం ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఏడీఈ గోవిందరెడ్డి ఆదేశించారు. సోమవారం తంబళ్లపల్లె 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సబ్‌స్టేషన్‌లో లాగ్ రికార్డు, బ్రేకర్లు, ఫీడర్లను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం స్థానిక విద్యుత్‌శాఖ కార్యాలయంలో సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మొండి బకాయిల వసూలుపై దృష్టి పెట్టాలన్నారు. ముఖ్యంగా పట్టణంలో, గ్రామాల్లో లో వోల్టేజీ సమస్య లేకుండా విద్యుత్ సరఫరా సక్రమంగా ఉండేలా చూడాలన్నారు. లో వోల్టేజి సమస్య ఉన్న ప్రాంతాల్లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు తక్షణమే నివేదికలు తయారు చేసి ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. వినియోగదారులు, రైతుల నుంచి విద్యుత్ సరఫరాకు సంబంధించిన ఫిర్యాదులు వస్తే నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే పరిష్కరించాలన్నారు.సిబ్బంది విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఏఈ సురేంద్ర, సబ్ ఇంజనీరు శేషుకుమార్, ఎల్ఐలు భాస్కర్, నాగరాజు, లైన్‌మెన్ అప్పిరెడ్డి, శంకర, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

జీవన శైలి మార్పులతో రక్తపోటు నియంత్రణ


గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

వాల్మీకిపురం, మే 26(ఆంధ్రజ్యోతి): చక్కటి జీవన శైలిని పాటించడం ద్వారా రక్తపోటును (బీపీ) నియంత్రించవచ్చునని వాల్మీకిపురం మండల హెల్త్ ఎడ్యుకేటర్ మహ్మద్‌రఫీ తెలిపారు. సోమవారం మండలంలోని కోటపల్లెలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రజలకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీపీ 50 శాతం వంశ పారంపర్యంగా వచ్చే అవకాశం ఉందన్నారు. ఎక్కువగా ఒత్తిడికి గురికావడం, ఆలోచనలు, ఆతృత, ఉప్పు ఉక్కువగా తినడం, సరైన వ్యాయామం లేకపోవడం, ఆహారపు అలవాట్లు తదితర వాటి వల్ల కూడా రక్తపోటుకు గురవుతారని, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వైద్య చికిత్సలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ భానుబీ, హృదయేశ్వరి, ఆశా వర్కర్లు శ్రీదేవి, స్వరూప తదితరులు పాల్గొన్నారు.